www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

FLASH INDIA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO.APTEL/2010/33229



**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039



| సంపుటి : 17 | సంచిక : 136 | బుధవారం 01.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/- |
|---|---|---|---|---|---|




## భారత సైన్యానికి కొత్త బాస్..

- భారత సైన్యానికి 31వ ఆర్మీ చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్
- ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణతో కొత్త సైన్యాధ్యక్షుడి బాధ్యతలు
- 1997 తర్వాత ఆర్మర్డ్ కోర్ నుంచి ఆర్మీ చీఫ్‌గా తొలి అధికారి
- దాదాపు నాలుగు దశాబ్దాల మిలిటరీ అనుభవం
- వైస్ చీఫ్ నుంచి ఆర్మీ చీఫ్ పదవికి ఎదిగిన ధీరజ్ సేథ్
- సదరన్, సౌత్ వెస్ట్రన్ కమాండ్లకు నాయకత్వం వహించిన అరుదైన అధికారి

05



## ఈ20 పెట్రోల్ ఇంకా ప్రయోగదశలోనే..

### సుప్రీంకోర్టుకు కేంద్రం క్లారిటీ

- ఇథనాల్ బ్లెండింగ్‌పై కేంద్రం కీలక వ్యాఖ్యలు
- ఈ20 ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉందని సుప్రీంకోర్టుకు వెల్లడి
- ఇథనాల్ ప్రభావంపై వచ్చే ఏడాదికి స్పష్టత వస్తుందన్న కేంద్రం
- బీపీసీఎల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ
- ఇథనాల్ కొనుగోళ్ల తగ్గింపుపై డిస్టిలరీల అభ్యంతరం
- కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేసిన బీపీసీఎల్
- ఈ20 లక్ష్యాలకు హైకోర్టు ఉత్తర్వులు అడ్డంకిగా మారతాయని వాదన


03

తమ వద్ద నుంచి ఇథనాల్ కొనుగోళ్లను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తగ్గించడాన్ని సవాల్ చేస్తూ డిస్టలరీ కంపెనీలు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. 2025-26 సరఫరా సంవత్సరానికి గాను ఇథనాల్ కేటాయింపులను పెంచాలని కోరిన ఒక డిస్టిలరీ అభ్యర్థనను పరిశీలించాలని గత జూన్ 23న కర్ణాటక హైకోర్టు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను ఆదేశించింది. దీనిపై బీపీసీఎల్ స్పందిస్తూ.. ఇలాంటి ఉత్తర్వుల వల్ల దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాలపై తీవ్ర ప్రభావం పడుతుందని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై ఇవాళ విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ కు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించింది. కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి దీనిపై స్పందిస్తూ ఇథనాల్ సరఫరా ఒప్పందాలు అక్టోబర్ 2025లోనే...

# కేసీఆర్ తెచ్చింది తాగుడు కల్చర్..

## వేల కోట్ల కమీషన్ల కోసమే 'కాళేశ్వరం'..

### ఆరు నెలల్లోనే రైతుల ఖాతాల్లో రూ.22,600 కోట్లు జమ



**ఎన్నికల ముందు రాష్ట్రంపై రూ.6 లక్షల కోట్ల అప్పు**

**బడి పిల్లల బిల్లులు కూడా పెండింగే..**

**అప్పులు చేసిన ఫామ్‌హౌస్‌లో పండలే..**

- రైతుభరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482 కోట్ల జమ
- సాగు ప్రారంభానికే రైతుభరోసా అందిస్తున్నామని సీఎం
- వ్యవసాయం దండగ కాదు.. పండగగా మార్చడమే లక్ష్యమన్న రేవంత్
- తెలంగాణను రూ.8.11 లక్షల కోట్ల అప్పులతో అప్పగించారు
- బీఆర్ఎస్ హయాంలో జీతాలు, బిల్లులు పెండింగ్‌లోనే
- 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ పూర్తి
- ఆరు నెలల్లో రూ.22,600 కోట్ల రుణమాఫీ అమలు చేశామని వెల్లడి
- ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని వ్యాఖ్య
- కాళేశ్వరం ప్రాజెక్టు వేల కోట్ల కమీషన్ల కోసమేనని ఆరోపణ
- రూ.లక్ష కోట్ల కాళేశ్వరం.. మూడేళ్లకే 'కూలేశ్వరం' అయింది

02

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అనుకునేలా తమ ప్రభుత్వం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్‌సీజన్‌లో రైతులకు అందించే రైతుభరోసా ఆర్థికసాయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి శిల్పాకళా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ మేరకు తొలిరోజు 41.37 లక్షల మంది రైతుల ఖాతాలోకి రూ.2482.02 కోట్లు జమ కానున్నాయి. ఒక ఎకరం వరకు భూమి కలిగిన 14.65 లక్షల మంది రైతుల కోసం రూ.878.94 కోట్లు, రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 26.72లక్షల మంది రైతుల కోసం రూ.1,603.08 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..



## ఐటీ మంత్రి పై సైబర్ అటాక్

### శ్రీధర్ బాబు దంపతులను వదలని నేరగాళ్లు

- ఏఐ మార్ఫింగ్ వీడియోలపై ఫిర్యాదు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం మంథని ఫేస్బుక్లో వీడియోలు
- సైబర్ క్రైమ్ పోలీసులకు మంత్రి అడ్వోకేట్ ఫిర్యాదు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

03


# మీ ద్రోహాన్ని మర్చిపోము

### రేవంత్ రెడ్డి.. రైతు ద్రోహి 30 నెలల్లో రైతులకు ₹30 వేల కోట్లు ఎగవేత



- రైతుభరోసా నిధులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన కేటీఆర్
- రూ.30 వేల కోట్ల రైతుభరోసా బకాయిలు ఎగ్గొట్టారని ఆరోపణ
- 'ఆశీర్వాద సభలు కాదు.. రైతులకు బకాయిలు చెల్లించండి'
- రైతుభరోసా కోసం సభలు పెట్టడం పీఆర్ స్టంట్ అని విమర్శ

03



## తెలంగాణ భవిష్యత్తు బీజేపీదే

- తెలంగాణ భవిష్యత్తు బీజేపీదేనన్న నితిన్ నబీన్
- 2028లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా
- ప్రజల గొంతుకగా మారాలని కార్యకర్తలకు పిలుపు
- బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీ బలమని ప్రశంస
- 2047 అభివృద్ధి చెందిన భారత లక్ష్యానికి కృషి చేయాలని పిలుపు

03

# సిగాచి దుర్ఘటనకు ఏడాది..

### కోటి ఇస్తామని కేవలం లక్షే ఇచ్చారు

**ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి లోపాయికారీ ఒప్పందం**

**డెత్ సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిప్పుకున్నారు**

- సిగాచి పేలుడు ఘటనకు ఏడాది.. బాధితులకు ఇంకా న్యాయం దూరం
- 54 మంది కార్మికుల మృతికి నివాళి అర్పించిన హరీశ్ రావు
- ప్రభుత్వ నిర్లక్ష్యమే ఘోర ప్రమాదానికి కారణమని ఆరోపణ
- రూ. కోటి పరిహారం హామీ అమలుపై ప్రశ్నలు
- పరిహారంలో పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు కలపడం అన్యాయమని విమర్శ
- డెత్ సర్టిఫికెట్ల కోసం కుటుంబాల అవస్థలు
- బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు ఇప్పటికీ అందని ద్రాక్షే
- సిగాచి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలపై తీవ్ర ఆరోపణలు
- ప్రభుత్వం-యాజమాన్యం మధ్య కుమ్మక్కు ఉందా? అంటూ ప్రశ్న
- ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి

02






# కాషాయం పార్టీలో భారీ మార్పులు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారతీయ జనతా పార్టీలో త్వరలోనే భారీ స్థాయిలో మార్పులు జరగనున్నట్టు సమాచారం. పార్టీతో పాటు ప్రభుత్వంలోనూ మార్పులు చేయనుండగా తెలంగాణలోనూ మార్పులు, చేర్పులు జరగనున్నాయి. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పార్టీ ముఖ్య నేతలకు సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది. కేంద్రంలో మంత్రివర్గ విస్తరణ చేయనున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతుండగా జూలైలో మార్పులు చేర్పులు ఉంటాయని పార్టీ నాయకులు సైతం చెబుతున్నారు.జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఎన్నికైన కొత్త జాతీయ కార్యవర్గాన్ని ఇంకా ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ అనంతరం జాతీయ కమిటీని ప్రకటించే ఛాన్స్ఉందని సమాచారం. దేశంలోని 7 రాష్ట్రాలకు 2027లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ఇంఛార్జిలను కూడా మార్చే ఛాన్స్ ఉందని తెలిసింది. తెలంగాణ నుంచి కొత్త వారికి అవకాశాలు రానున్నాయని, ఇతర రాష్ట్రాల ఇంఛార్జిలుగా సేవలు అందించడానికి ఇక్కడి నేతలు సైతం ఉత్సాహంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

**10 రోజుల్లో డిక్లేర్**

కేంద్ర మంత్రి పదవి విషయంలో ఇంకా స్పష్టత రాకపోయినా మార్పులు చేర్పులు ఉంటాయని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. ఆ దిశగానే కేంద్రంలోని కీలక నాయకులు కసరత్తు చేస్తున్నారని చెబుతున్నారు. మంత్రివర్గ విస్తరణ జరిగిన తర్వాత పార్లమెంట్సమావేశాలు ఆ సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన, సీట్ల పెంపు బిల్లులను మరోసారి పార్లమెంట్‌లో పెట్టి ఆమోదింపచేసే విధంగా తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయంటున్నారు. ఇదే జరిగితే ఇంకా ఎక్కువ స్థాయిలో మార్పులు ఉంటాయని, మహిళలకు ఇప్పటి నుంచే ప్రాతినిధ్యం పెంచే అవకాశం ఉందని సమాచారం. కేంద్ర పార్టీ కమిటీలో పలువురు రాష్ట్రానికి చెందిన నేతలు తమకు అవకాశం దక్కుతుందని ఆశతో ఉన్నారు.ఇప్పటివరకు జాతీయ కమిటీలో ఉపాధ్యక్షురాలిగా ఎంపీ డీకే అరుణ, కార్యవర్గ సభ్యులుగా ఎంపీ ఈటల రాజేందర్ ఉన్నారు. పొంగులేటి సుధాకర్ రెడ్డి తమిళనాడు సహ ఇంఛార్జిగా ఉన్నారు. కేంద్ర మంత్రివర్గంలో తమకు స్థానం దక్కుతుందని ఎంపీలు ఎవరికి వారు నమ్ముతున్నారు. 9 మంది ఎంపీలు ఉండగా ఇద్దరు మంత్రులుగా ఉన్నారు. మిగిలిన ఏడుగురు ఏవరికి వారు తమకే మంత్రి పదవి వస్తుందని అంచనా వేసుకుంటున్నారు. ఈ సస్పెన్స్‌కు మరో 10 రోజుల్లో తెరపడనున్నట్టు పార్టీ నాయకులు చెబుతున్నారు.

# సీఎంతో భేటీలో సునీల్ మిట్టల్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, AI కార్యకలాపాలపైన దృష్టి పెట్టాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఇవాళ ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధీ పెవిలియన్‌లో సునీల్ భారతి మిట్టల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణలో చేపట్టిన అనేక కార్యక్రమాలు, సంస్కరణలను వివరిస్తూ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన అంశాలను ప్రస్తావించారు. ప్రత్యేకంగా విద్యా రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేస్తున్న తీరును వివరించారు. పారిశ్రామిక రంగ అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రత్యేకంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అధునాతన సాంకేతిక విధానాలతో ఏటీసీలుగా మార్చిన విషయాలను తెలిపారు. ఇదే కోవలో పాలిటెక్నిక్ కాలేజీల అధునికీకరణ గురించి చెప్పారు.

**వీలైనంత తొందరగా చందన్ వెల్లి డేటా సెంటర్:**

చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత తొందరగా ప్రారంభించాలని, తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్, ఌ× మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం కోరారు. రాష్ట్రంలో భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేసి సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

**విద్యార్థులకు స్కాలప్ షిప్‌లు:**

భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేస్తామని ఈ సందర్భంగా సునీల్ మిట్టల్ సీఎంకు తెలిపారు. అలాగే, ఎయిర్‌టెల్‌కు రెండో హెడ్ క్వార్టర్‌గా హైదరాబాద్‌ను పరిగణిస్తున్నామని చెప్పారు. డేటా సెంటర్ల కెపాసిటీని మరింత పెంచడానికి సిద్ధంగా ఉన్నామని, తెలంగాణలో ఫైబర్ కనెక్టివిటీ మరింత పెంచడంపైన ఈ సందర్భంగా సునీల్ మిట్టల్ ఆసక్తిని ప్రదర్శించారు.

# సిగాచి దుర్ఘటనకు ఏడాది..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 30 జూన్ 2025 ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కూటి కోసం, కూలి కోసం వలస వచ్చి సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో పనిచేస్తున్న 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం అని, సిగాచి కంపెనీ నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన అమాయక కార్మికులకు నివాళి అర్పించారు. ఈ హృదయవిదారక ఘటనతో యావత్ దేశం ఉలిక్కిపడింది కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనసు మాత్రం కరగలేదని విమర్శించారు. దుర్ఘటన జరిగిన రోజు హైదరాబాద్‌లోని తన జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లోనే ఉన్నా.. 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిగాచి పరిశ్రమ వద్దకు మాత్రం రాలేదని బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవలేదన్నారు.

**కోటి ఇస్తామని కేవలం లక్షే ఇచ్చారు:**

విమర్శలు రావడంతో తెల్లారి ఘటన వద్దకు వచ్చిన రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి పరిహారం ఇస్తామని ఘనంగా ప్రకటించారు. కోటి ఇస్తామని గొప్పలు చెప్పిన రేవంత్ రెడ్డి, ప్రభుత్వం తరపున ఇచ్చింది మాత్రం కేవలం లక్షరూపాలయలు మాత్రమేనన్నారు. ఇంతకంటే సిగ్గుమాలిన చర్యల ఏమైనా ఉంటదా? తలదించుకోవాలన్నారు. కంపెనీ ఇచ్చిన డబ్బులు బాధిత కుటుంబాలకు ముట్టజెప్పి, కోటి పరిహారం నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని పరిహారంలో చూపడం శోచనీయం అన్నారు. అవేదో కంపెనీ జేబులోంచి ఇస్తున్న పరిహారం కాదు, కార్మికులు కష్టార్జితం నుంచి హక్కుగా వచ్చిన డబ్బు అని చెప్పారు.

**డెత్ సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిప్పుకున్నారు:**

కార్మికుల కష్టార్జితాన్ని కూడా తీసుకువచ్చి కంపెనీ ఇచ్చే పరిహారంలో కలిపి చూపించడం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించారు. క్షతగాత్రులకు సరైన వైద్య సహాయం అందక, జీతాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు. బాధిత కుటుంబాలకు ఇస్తానన్న ఉద్యోగాలు ఇప్పటికీ దిక్కులేదు. కార్మిక శాఖ బాధ్యత రాహిత్యానికి అమాయక వలస బతుకులు వేదన చెందుతున్నాయి. ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇదన్నారు.

**ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి లోపాయికారీ ఒప్పందం:**

ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందన్నారు. 818 హెచ్‌పీ సామర్థ్యానికి మాత్రమే అనుమతి తీసుకుని, అక్రమంగా 1777 హెచ్‌పీకి యంత్రాలను పెంచేశారని సేఫ్టీ గార్డ్స్ లేవు, ఫైర్ ఎన్‌ఓసీ లేదు, డస్ట్ కంట్రోల్ సిస్టమ్ పనిచేయలేదన్నారు. ఇంత నిర్లక్ష్యం బయటపడినా, ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదన్నారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు.

**మాట తప్పడం మీకు ఎలాగూ అలవాటే:**

ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వందల కోట్ల టర్నోవర్ ఉన్న సిగాచి కంపెనీ డైరెక్టర్ల ఆస్తులను రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద అటాచ్ చేసి వాటిని అమ్మి అయినా బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు భేషరతుగా కోటి రూపాయల పరిహారాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. బతికున్న ప్రజలను మోసం చేయడం, మాట తప్పడం మీకు ఎలాగూ అలవాటే. కానీ కనీసం ఆ ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికులను, దిక్కుతోచని స్థితిలో ఉన్న వారి కుటుంబాలను మోసం చేయవద్దన్నారు. రుణమాఫీ చేస్తానని దేవుళ్ల మీద ఒట్లు పెట్టి మాట తప్పారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తానని ప్రజలకు మాట ఇచ్చి తప్పారు. బాధిత కుటుంబాలకు కోటి రూపాయలు ఇస్తానని మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాటను కూడా తప్పారు. మాట మీద నిలబడే అలవాటు లేదా రేవంత్ రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలేనా? ప్రజలు ఏమనుకుంటారో అనే కనీస ఆలోచన లేదా? అని మండిడ్డారు. మీరు ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోండి. లేకపోతే ఈ బాధిత కుటుంబాల కన్నీళ్లు, ఆవేదన ఈ ప్రభుత్వాన్ని తప్పకుండా వెంటాడుతాయి.




# వారంలో నివేదిక ఇవ్వండి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధి కోసం భూముల కేటాయింపుల విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఏ ప్రాతిపదికన స్థలాలు ఇచ్చినా సదరు భూమి యాజమాన్యపు హక్కులు మాత్రం పూర్తిగా టెంపుల్ బోర్డు వద్దే ఉండాలని అధికారులకు తేల్చిచెప్పారు. యాదగిరి గుట్ట ఆలయ అభివృద్ధిపై ఎంసీఆర్‌హెచ్ఆర్డి బోధి పెవిలియన్‌లో ఇవాళ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. యాదగిరి గుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ కోసం మార్కెట్ రేట్ ప్రకారం భూమి కేటాయించాలని ఆదేశించారు. వివిధ మతాలకు భూముల కేటాయింపు పైన ఒక విధానం రూపొందించాలన్నారు. కుల సంఘాలకు స్థలం కేటాయింపు పైన స్పష్టమైన నిబంధనలతో కూడిన విధానం తయారుచేయాలన్నారు.

**వారంలో నివేదిక ఇవ్వండి:**

గుట్టపైన గెస్ట్ హౌస్‌ల నిర్మాణం కోసం ముందుకు వచ్చిన వాళ్ల జాబితా రూపొందించాలని విడతల వారీగా గెస్ట్ హౌస్ ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలన్నారు. గెస్ట్ హౌస్ ల నిర్మాణం పైన తిరుమల మోడల్ ను అనుసరించాలని భూ సేకరణ కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలన్నారు. యాదగిరి గుట్ట ఆలయం నిర్మాణంపైన ఇంజనీర్ల కమిటీ ఇచ్చిన నివేదిక పైన అధ్యయనంచేసి వారంలో నివేదిక ఇవ్వాలన్నారు. పబ్లిక్ ప్రైవేట్ విధానంలో టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షలో రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సీఎంఓ సెక్రటరీ మానిక్ రాజ్, సీఎంఓ ఓఎస్డీ వేముల శ్రీనివాసులు,యాదాద్రి జిల్లా ఉన్నతాధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



# కేసీఆర్ తెచ్చింది తాగుడు కల్చర్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అనుకునేలా తమ ప్రభుత్వం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్‌సీజన్‌లో రైతులకు అందించే రైతుభరోసా ఆర్థికసాయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి శిల్పాకళా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ మేరకు తొలిరోజు 41.37 లక్షల మంది రైతుల ఖాతాలోకి రూ.2482.02 కోట్లు జమ కానున్నాయి. ఒక ఎకరం వరకు భూమి కలిగిన 14.65 లక్షల మంది రైతుల కోసం రూ.878.94 కోట్లు, రెండు ఎకరాల వరకు భూమి కలిగిన 26.72లక్షల మంది రైతుల కోసం రూ.1,603.08 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలంలో సాగు పనులు మొదలయ్యే నాటికే రైతుభరోసాను అందిస్తున్నామని అన్నారు. గత 30 నెలలుగా రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 19 మంది ముఖ్యమంత్రులు పాలించారని, 19 మంది సీఎంలు చేసిన అప్పు రూ.60వేల కోట్లు మాత్రమేనని అన్నారు. కానీ తెలంగాణ వచ్చాక కేసీఆర్ చేసిన అప్పు రూ.8.11 లక్షల కోట్లు అయిందని పేర్కొన్నారు. రూ.8.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలో మునిగిన తెలంగాణ రాష్ట్రాన్ని తనకు అప్పగించారని రేవంత్ రెడ్డి అన్నారు.

**బడి పిల్లల బిల్లులు కూడా పెండింగే..**

ఎన్నికల ముందు రాష్ట్రంపై రూ.6 లక్షల కోట్ల అప్పు ఉంటుందని భావించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక లెక్కలు తీస్తే.. గుట్ల కొద్దీ అప్పులు బయటపడ్డాయని కామెంట్ చేశారు. 2023లో సీఎస్ వంటి ఐఏఎస్‌లకే 1న జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదన్నారు. కొన్నేళ్లుగా జీతాలు వాయిదా పద్ధతిలో వస్తున్నాయని అధికారులే తమ వద్ద మొర పెట్టుకున్నారని గుర్తు చేశారు. బడి పిల్ల తిండి బిల్లులు కూడా వేల కోట్లు బకాయిలు పెట్టి పోయారని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆయన ఫైర్ అయ్యారు. సర్పంచ్‌లకు వేల కోట్లు పెండింగ్ పెట్టిపోతే ఇప్పుడు ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్.. బద్నాం మోసింది తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పులతో ఢిల్లీలో కూడా పరువుపోయే పరిస్థితి ఉందన్నారు.

**అప్పులు చేసిన ఫామ్‌హౌస్‌లో పండలే..**

నేను తప్పులు చేసి ఫామ్‌హౌస్‌లో పడుకుని.. తప్పించుకుం తిరగట్లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పులు తీరుస్తూ.. ప్రజల మధ్యే ధైర్యంగా తిరుగుతున్నానని పేర్కొన్నారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులకు రూ.2లక్షల లోపు రుణాలన్నీ మాఫీ చేశామని అన్నారు. రుణ మాఫీ కంద ఆరు నెలల్లోనే రైతుల ఖాతాల్లో రూ.22,600 కోట్లు జమ చేశామని తెలిపారు. కాంగ్రెస్ వస్తే.. కరెంట్ ఉండదని దుష్ప్రచారం చేశారని, సాగుకు ఉచిత కరెంట్ అనేది కాంగ్రెస్ పేటెంట్ హక్కని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**వేల కోట్ల కమీషన్ల కోసమే 'కాళేశ్వరం'..**

రాష్ట్రంలో రైతులకు కేవలం ఉచిత కరెంట్ కోసం రూ.36 వేల కోట్లు చెల్లించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వ్యవసాయ పనిముట్ల కోసం ఏటా వెయ్యి కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రైతు బీమా కోసం ఏటా రూ.3,500 చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. వేల కోట్ల కమీషన్ల కోసమే హడావుడిగా కాళేశ్వరం కట్టారని కామెంట్ చేశారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరం అయిందని అన్నారు. బోరు కింద పంట పండితే కూడా కాళేశ్వరం మహిమేనని మోసం చేశారని సీఎం ఫైర్ అయ్యారు. కూలిన కాళేశ్వరం నుంచి మూడేళ్లుగా చుక్కనీరు తీసుకోలేదని.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నెంబర్‌వన్‌గా నిలిచిందని అన్నారు.

**కేసీఆర్ తాగుడు కల్చర్ తెచ్చిండు..**

ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులను సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్.. ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారని అని ధ్వజమెత్తారు. దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా.. నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా అని అన్నారు. కానీ, ఊరూరికి మాత్రం బెల్ట్ షాపులు తెచ్చి తాగులు కల్చర్ తెచ్చాడంటూ సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.

**కాళేశ్వరంపై కాశీ మజిలీ కథలు ఇంకెంత కాలం..**

కాళేశ్వరంపై కాశీమజిలీ కథలు ఇంకెంత కాలం చెబుతారని సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై సెటైర్లు వేశారు. ఇవాళ నగరంలో శిల్పకళా వేదికలో రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు ప్రజలు నమ్మారని.. చివరకు బకాసురుడిని బంధించి ఫామ్‌హౌస్‌లో పెట్టారంటూ ఛలోక్తులు విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నష్టాల్లో కొట్టుమిట్టాడిన ఆర్టీసీ నేడు వెయ్యి కోట్ల లాభంతో నడుస్తోందని అన్నారు. సింగరేణి, విద్యుత్ శాఖలో భారీ సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్, 12 ఏళ్ల మోడీ పాలనతో పాటు రెండున్నరేళ్ల తమ పాలనపై అసెంబ్లీలో చర్చ పెడదామని విపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**బీజేపీకి స్ట్రాంగ్ వార్నింగ్...**

బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావడానికి 15 ఏళ్లు పట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అక్కడ మమత కాబట్టి ఊరుకున్నారు.. ఇక్కడ మా వాళ్లు గట్టి సమాధానం చెబుతారంటూ బీజేపీకి వార్నింగ్ ఇచ్చారు. తాను ఉన్నది ఉన్నట్లుగా చెబుతానని, పదవి శాశ్వతం కాదన్నారు. ఇందిరమ్మ, ఎన్టీఆర్‌లకే పదవులు శాశ్వతం కాదు.. అబద్దాలు చెప్పి నమ్మించను, ఉన్నదే చెబుతానని రేవంత్ రెడ్డి అన్నారు. వర్షాలు ఉండవని నిపుణులు చెబుతున్నారని, వర్షాలు పడకపోతే ఇబ్బంది ఉంటుందని, అందుకు పంటలను మార్చమని చెబుతున్నాయని తెలిపారు. పంట మార్పిడి చేయమంటే దానిపై కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాపం ఉన్నట్లుగా ఓ కుటుంబ అంతా అబద్ధాలు చెబుతూ తిరగుతున్నారని, దోపిడీ లేకుండా పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ఒక్క పథకం అమలు చేయలేదని ఆరోపించారు. సంసారాన్ని సర్దుకుపోతున్నామని, బజారున పెట్టుకోవద్దని చూస్తున్నామని అన్నారు. వందల మంది త్యాగలు చేస్తే పదవులు వచ్చాయని, ఉద్యోగాలు ఇచ్చింది ప్రజాపాలన కాదా అని ప్రశ్నించారు. తమను అధికారంలోంచి దిగిపో అంటున్నారని.. ఇదేమన్నా మీ గడీనా అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

## 'రైతు భరోసా' నిధుల విడుదల



**హుస్నాబాద్,ఫ్లాష్ ఇండియా :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ప్రజాస్వామ్యానికి అసలైన పునాది అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 17, 18వ వార్డుల్లో మంగళవారం ఆయన పర్యటించారు. అక్కడ కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఇంటింటికీ వెళ్తున్న బీఎల్ఓలు, బీఎల్ఏలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం నేటి నుంచే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను విడుదల చేస్తుందని ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ఓట్ల కోసమే రైతుబంధు పేరిట ఎస్ఎంఎస్ ల హడావుడి చేసిందని, నిధుల విడుదలకు నెలల తరబడి సమయం తీసుకుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 30 నెలల్లోనే రూ. 27వేల కోట్లను రైతులకు అందించిందని గుర్తుచేశారు. గతంలో 9 రోజుల్లోనే నిధులు వేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈసారి కూడా అంతే వేగంగా పంపిణీ పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రైతులకు సన్న వడ్ల బోనస్, ఆధునిక పనిముట్లు ఇస్తున్నామని, ధాన్యం కొనుగోళ్లు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి లోటు లేకుండా చూస్తున్నామన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల సరఫరా పై బీజేపీ ఎంపీలు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఇతర రాష్ట్రాల్లో వ్యతిరేక ఓట్లను తొలగిస్తుందని ఆరోపించిన మంత్రి.. కాంగ్రెస్ శ్రేణులు, బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండి అర్హుల ఓటు హక్కు పోకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## మీ ద్రోహాన్ని మర్చిపోము

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రభుత్వం రాష్ట్ర రైతులకు పెద్ద ఎత్తున రైతుభరోసా నిధులు బాకీ పడిందని గడిచిన 30 నెలల పాలనలో దాదాపు రూ. 30 వేల కోట్ల రైతు భరోసా నిధులను ఎగ్గొట్టిందే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతులకు బకాయి పడిన రైతు భరోసా నిధులు, కాంగ్రెస్ ప్రభుత్వ ఎగవేతలపై ఇవాళ ఆయన స్పందించారు. గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా అని నిలదీశారు.

**శాపంలా వెంటాడటం ఖాయం**

కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే రేవంత్ రెడ్డి పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారన్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే అవుతుందన్నారు. ప్రతి ఎకరానికి ఏడాదికి 15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీచేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలన్నారు. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం అని హెచ్చరించారు.

**అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు**

ఇప్పటికే 50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశారని, 72 సార్లు సీఎం ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకోవాలన్నారు. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారన్నారు. కేసీఆర్ టంచన్ గా 11 సార్లు, 73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారని, పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. రేవంత్ రెడ్డి ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని ఇది గుర్తుపెట్టుకోవాలన్నారు.

## తెలంగాణ ఉద్యమంపై మాట్లాడే నైతిక హక్కు రేవంత్ లేదు

**మిడ్జిల్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఉద్యమంపై మాట్లాడే నైతిక హక్కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. "నువ్వు ఎన్నడూ 'జై తెలంగాణ' అనలేదు.. తెలంగాణ ఉద్యమం కోసం పోరాటం చేయలేదు" అంటూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.



మంగళవారం మిడ్జిల్ మండల కేంద్రంలో టీఆర్ఎస్ నాయకుడు మన్యం వెంకట్ రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొన్నారు. మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి రాజీనామా చేసింది మాజీ మంత్రి లక్ష్మారెడ్డేనని గుర్తు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేశారు. గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాలకు తరలిస్తూ "బాబు జపం" చేస్తున్నారని విమర్శించారు. మిడ్జిల్ ప్రాంతానికి నేడు సాగునీరు అందుతోందంటే అది మాజీ మంత్రి లక్ష్మారెడ్డి కృషి ఫలితమేనని కొనియాడారు. చిల్వేర్ గ్రామం వద్ద దుందుభి వాగుపై నిర్మించిన వంతెన పనులను వేగవంతం చేసేందుకు తాము రాత్రింబవళ్లు కృషి చేశామని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా ప్రజలకు చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ చేయలేదని విమర్శించారు. సర్పంచ్ రాధిక భర్త, దివంగత నాయకుడు మన్యం వెంకట్ రెడ్డి గ్రామ అభివృద్ధికి విశేష సేవలు అందించారని హరీశ్ రావు కొనియాడారు. ఆయన పట్ల కార్యకర్తలు చూపుతున్న అభిమానాన్ని చూస్తుంటే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీదే విజయం అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల కలను సాకారం చేసిన మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మళ్లీ అధికారంలోకి వస్తారని, వచ్చే ప్రభుత్వం బీఆర్ఎస్‌దేనని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం నుంచి మన్యం బాల్ రెడ్డి కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రులకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాండు, జిల్లా నాయకులు సుధా బాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, జంగి రెడ్డి, సుదర్శన్, బాలు, శ్రీనివాసులు, గంజి కృష్ణ, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, వెంకట్ సాగర్, భీమ్ రాజు, గంజి శేఖర్, మల్లేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ మంత్రి పై సైబర్ అటాక్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సైబర్ నేరగాళ్లు సామాన్యులు, ఉద్యోగులను మాత్రమే కాదు.. మంత్రులను కూడా టార్గెట్ చేసుకుంటున్నారు. టెక్నాలజీని మంచికి బదులుగా చెడు పనులు, దుష్ప్రచారం కోసం వినియోగించడం ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సైతం సైబర్ బాధితుడు అయ్యా రు. మంత్రి శ్రీధర్ బాబు, ఆయన సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్పై సోషల్ మీడియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా క్రియేట్ చేసిన మార్ఫింగ్ వీడియోలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఫేస్బుక్, ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫాంలలో అభ్యంతర కర కంటెంట్తో కూడిన వీడియోలను పోస్టు చేస్తూ, వారి పరువు ప్రతిష్టలకు భంగం కలిగేలా కుట్రలు జరుగుతున్నా యని లాయర్ శశిభూషణ్ కాశే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతమైనపదవులు, స్థానాల్లో ఉన్నారి ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు ఈ వెకిలి పనులు చేస్తు న్నారని, అందుకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవా లని కోరారు.

**టెక్నాలజీ దుర్వినియోగం, కేసు నమోదు చేసిన పోలీసులు**

సరికొత్త ఏఐ టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ నకిలీ వీడియోలు (ఫేక్ వీడియోస్) క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేసి వైరల్ చేస్తున్నారని లాయర్ శశిభూషణ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో ము ఖ్యంగా ప్రతిష్టాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిధుల అక్రమాలకు సంబంధించిన అంశంలో మంత్రి శ్రీధర్ బాబును తప్పుడు రీతిలో చిత్రీకరిస్తూ ఫేక్ వీడియోలను సర్క్యులేట్ చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ మంథని అనే ఫేస్ బుక్ పేజీ ద్వారా సైతం దుష్ప్రచారం చేస్తున్నారని, అందుకు సంబంధించిన ఆధారాలను పోలీసులకు సమర్పిం చారు. మంత్రి శ్రీధర్ బాబు లాయర్ ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారం భించారు.

## తెలంగాణ భవిష్యత్తు బీజేపీదే

**ఘట్కేసర్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ భవిష్యత్తు బీజేపీదేనని, రాష్ట్రంలో మార్పు తీసుకురావాలంటే ప్రజల గొంతుకగా మారాలని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నితిన్ నబీన్ అన్నారు. మంగళవారం ఘట్కేసర్ సర్కిల్ అంక్షాపూర్‌లోని రాక్ గార్డెన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో ప్రజలు కన్న కలలను సాకారం చేసే దిశగా బీజేపీ పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. 1980లో స్థాపితమైన భారతీయ జనతా పార్టీ తొలిసారి ఎన్నికల్లో విజయం సాధించడంలో కార్యకర్తల కృషే ప్రధాన కారణమని అన్నారు. ఒకప్పుడు ఇద్దరు పార్లమెంట్ సభ్యులతో ప్రారంభమైన పార్టీ, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందని చెప్పారు. దీనికి బూత్ స్థాయి కార్యకర్తల కఠోర శ్రమే కారణమని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని, ఆ దిశగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2019, 2024 ఎన్నికల్లో 35 శాతం ఓట్లను సాధించడం ద్వారా తెలంగాణలో బీజేపీ తన ఉనికిని బలంగా చాటుకుందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ విజయాల వెనుక కూడా కార్యకర్తల కృషి కీలకమైందన్నారు.

**ప్రజల గొంతుకగా నిలవాలి..**

తెలంగాణలో మార్పు తీసుకురావాలంటే ప్రజల గొంతుకగా మారి, ఆ గొంతును వీధుల వరకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. 2028 నాటికి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోని 22 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడటానికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలు ఉంచిన విశ్వాసమే కారణమన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని, బీబీనగర్‌లో ఎయిమ్స్ ఏర్పాటు చేశామని, సమ్మక్క-సారలమ్మ పేరుతో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను కూడా కేంద్రం చేపట్టిందని తెలిపారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం ఆరు హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు.

**తెలంగాణలో 'ఆర్ఆర్ పన్ను' వసూలు..**

తెలంగాణ ప్రభుత్వం 'ఆర్ఆర్ పన్ను' ద్వారా ఢిల్లీ దర్బార్‌కు నిధులు తరలిస్తోందని ఆరోపించారు. వీధుల నుంచి శాసనసభ వరకు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, ఈ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలే బీఆర్ఎస్ పతనానికి కారణమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే సంప్రదాయాలను కొనసాగిస్తోందని విమర్శించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి వేదికగా మార్చిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల డబ్బును ఢిల్లీకి తరలిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ20 పెట్రోల్ ఇంకా ప్రయోగదశలోనే..

**న్యూ ఢిల్లీ :** దేశంలో ఇథనాల్ బ్లెండింగ్ పై పెద్ద ఎత్తున విమర్శలు, చర్చ జరుగుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం వాదన చర్చనీయాంశంగా మారింది. దేశంలో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ చేసే ప్రక్రియ ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉందని దీని ప్రభావం ఏంటనే ఫలితాలు వచ్చే ఏడాది నాటికి స్పష్టం అవుతాయని మంగళవారం కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఒక ఉత్తర్వును సవాల్ చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం ఈ వాదన చేయడం గమనార్హం.

**ఈ20 పాలసీకి విఘాతం కలుగుతుందని..**

తమ వద్ద నుంచి ఇథనాల్ కొనుగోళ్లను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తగ్గించడాన్ని సవాల్ చేస్తూ డిస్టలరీ కంపెనీలు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. 2025-26 సరఫరా సంవత్సరానికి గాను ఇథనాల్ కేటాయింపులను పెంచాలని కోరిన ఒక డిస్టిలరీ అభ్యర్థనను పరిశీలించాలని గత జూన్ 23న కర్ణాటక హైకోర్టు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను ఆదేశించింది. దీనిపై బీపీసీఎల్ స్పందిస్తూ.. ఇలాంటి ఉత్తర్వుల వల్ల దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాలపై తీవ్ర ప్రభావం పడుతుందని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై ఇవాళ విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ కు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించింది. కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి దీనిపై స్పందిస్తూ ఇథనాల్ సరఫరా ఒప్పందాలు అక్టోబర్ 2025లోనే ఖరారయ్యాయని ఇలాంటి పిటిషన్లు పలు హైకోర్టులలో పెండింగ్‌లో ఉన్నాయి. ఒకవేళ డివిజన్ బెంచ్ కు వెళితే ఇతర హైకోర్టుల నుంచి ఇదే తరహా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని దీని వల్ల ఈ20 పాలసీకి విఘాతం కలిగే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.







## బకాయిలు వెంటనే చెల్లించాలి

**కార్వాన్,ఫ్లాష్ ఇండియా :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, పాత పద్ధతిలోనే ఈ పథకాన్ని కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ల సతీష్ ఆధ్వర్యంలో లకిడికాపూల్‌లోని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ముందు బీసీ విద్యార్థులు మహా ధర్నా నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత 18 ఏళ్లుగా విజయవంతంగా కొనసాగుతున్న ఈ విద్యా పథకానికి తూట్లు పొడవడం సరికాదన్నారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం యథావిధిగా అమలవుతున్నప్పుడు, తెలంగాణలో అమలు చేయడానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తన విధానాన్ని మార్చుకొని, విద్యార్థుల పై అదనపు ఆర్థిక భారం మోపే నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి లోకాన్ని ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం అధ్యక్షుడు, బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు అనంతయ్య, జిల్లాపల్లి తాజీ, నీల వెంకటేష్, బీసీ సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జులై 2న తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి (కేబినెట్) అత్యవసర సమావేశం ఫిక్స్ అయింది. జూలై 2వ తేదీన (గురువారం) మధ్యాహ్నం 3:00 గంటలకు ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈ కీలక భేటీ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం 6వ అంతస్తులో గల కేబినెట్ సమావేశ మందిరంలో ఈ 34వ మంత్రిమండలి సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

**అజెండాపై కసరత్తు.. రేపటికల్లా నివేదికలు..**

కేబినెట్ భేటీ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖలు అజెండా రూపకల్పనపై కసరత్తు ముమ్మరం చేశాయి. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, మరియు వివిధ శాఖల కార్యదర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సర్క్యులేషన్ ద్వారా ఆమోదించి, వాటిని తెలుగు అనువాదంతో సహా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నివేదికలను రేపు అనగా జూలై 1వ తేదీ మధ్యాహ్నం 1:00 గంటల కల్లా ఖచ్చితంగా పంపాలని సీఎస్ ఆదేశించారు. ఒకవేళ ఏ శాఖలోనైనా అజెండా అంశాలు లేనట్లయితే.. 'నిల్' రిపోర్టును కూడా నిర్ణీత సమయానికి అందించాలని స్పష్టం చేశారు.

**అధికారులందరూ హెడ్ క్వార్టర్స్ లోనే ఉండాలి..**

మంత్రిమండలి సమావేశం జరిగే సమయంలో ఎలాంటి పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. కేబినెట్ సమావేశం ముగిసే వరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులందరూ ఖచ్చితంగా తమ ప్రధాన కార్యాలయాల్లో (హెడ్ క్వార్టర్స్) అందుబాటులో ఉండాలని సీఎస్ కె. రామకృష్ణారావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరోవైపు ఈ కీలక సమావేశానికి సంబంధించి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రోటోకాల్ డైరెక్టర్, హార్టికల్చర్ డైరెక్టర్, సచివాలయ బ్రాంచ్ TGTS యూనిట్ మేనేజర్, ట్రాన్స్‌లేషన్స్ డైరెక్టర్ లను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ, పరిపాలనాపరమైన పరిణామాలు, పలు కీలక బిల్లులు, ప్రజా సంక్షేమ పథకాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి.

## సంపాదకీయం

# ఏఐ యుగంలో జర్నలిజం... కలం గెలుస్తుందా?

మానవ నాగరికతలో ప్రతి సాంకేతిక విప్లవం ఒక కొత్త అవకాశాన్ని తీసుకొచ్చింది. అదే సమయంలో ఒక కొత్త సవాలును కూడా ముందుంచింది. ముద్రణ యంత్రం ఆవిష్కరణ పుస్తకాల ప్రపంచాన్ని మార్చింది. రేడియో సమాచారాన్ని ఇంటింటికీ చేర్చింది. టెలివిజన్ వార్తలను దృశ్యరూపంలో ప్రజల ముందుకు తీసుకొచ్చింది. ఇంటర్నెట్ సమాచారానికి సరిహద్దులను చెరిపేసింది. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఈ పరిణామాలన్నింటినీ మరోసారి తిరగరాస్తోంది.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వైద్యం నుంచి విద్య వరకు, పరిశ్రమల నుంచి ప్రభుత్వ పరిపాలన వరకు ప్రతి రంగంలో ఏఐ వినియోగం పెరుగుతోంది. సహజంగానే ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే మీడియా రంగం కూడా ఈ మార్పుకు అతీతం కాదు. వార్తల సేకరణ, అనువాదం, హెడ్‌లైన్‌ల తయారీ, వీడియో ఎడిటింగ్, డేటా విశ్లేషణ, సోషల్ మీడియా పంపిణీ, పాఠకుల అభిరుచుల అంచనా ప్రతి దశలో ఏఐ భాగస్వామిగా మారుతోంది.అయితే ఇక్కడే ఒక కీలక ప్రశ్న తలెత్తుతోంది. ఏఐ జర్నలిస్టుకు సహాయక సాధనమా? లేక జర్నలిస్టునే ప్రత్యామ్నాయంగా మార్చే శక్తిగా ఎదుగుతోందా? ఈ ప్రశ్నకు సమాధానం కేవలం మీడియా భవిష్యత్తునే కాదు, ప్రజాస్వామ్య భవిష్యత్తును కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

### వార్త అంటే కేవలం సమాచారం కాదు

వార్త అనేది కేవలం జరిగిన సంఘటనల సమాహారం కాదు. దాని వెనుక సామాజిక నేపథ్యం, రాజకీయ సందర్భం, మానవీయ కోణం, చారిత్రక అనుసంధానం, బాధితుల భావోద్వేగం, ప్రజాప్రయోజనం వంటి అనేక అంశాలు ఉంటాయి.ఒక వరద వార్తను ఏఐ కొన్ని సెకన్లలో రాయగలదు. కానీ వరదలో ఇల్లు కోల్పోయిన కుటుంబం ఎదుర్కొంటున్న బాధను, సహాయక శిబిరాల్లో పిల్లల పరిస్థితిని, ప్రభుత్వ చర్యలపై ప్రజల అభిప్రాయాన్ని, అధికారుల బాధ్యతను ప్రశ్నించే శక్తి మాత్రం క్షేత్రస్థాయి జర్నలిస్టుకే ఉంటుంది.జర్నలిజం డేటా కంటే ఎక్కువ. అది మనుషుల జీవితాలను అర్థం చేసుకునే కళ. ఒక వార్త వెనుక కనిపించని వాస్తవాన్ని వెలికితీయడమే అసలు జర్నలిజం.

### ఏఐ బలం ఏమిటి?

ఏఐ సామర్థ్యాన్ని పూర్తిగా తిరస్కరించడం వాస్తవికం కాదు. నిమిషాల్లో వేల పేజీల నివేదికలను విశ్లేషించగలదు. కోర్టు తీర్పులు, బడ్జెట్ పత్రాలు, ఎన్నికల గణాంకాలు, సంస్థల ఆర్థిక నివేదికలు వంటి భారీ డేటాలో నమూనాలను గుర్తించగలదు.ఒక జర్నలిస్టు గంటల తరబడి చేసే అనువాదాన్ని కొన్ని సెకన్లలో పూర్తి చేయగలదు. సమావేశాల ఆడియోలను వేగంగా టెక్స్ట్‌గా మార్చగలదు. పాత కథనాలను శోధించి అవసరమైన సమాచారాన్ని అందించగలదు. డేటా జర్నలిజంలో ఏఐ ఒక విప్లవాత్మక సాధనంగా మారింది.అంటే ఏఐ శత్రువు కాదు. కానీ అది నిర్ణయాలు తీసుకునే సంపాదకుడు కూడా కాదు.

### భావోద్వేగాన్ని అల్గారిథం నేర్చుకోగలదా?

ఏఐ ఎంత తెలివిగా కనిపించినా అది అనుభవించదు. బాధను ఫీల్ కాదు. అన్యాయాన్ని గుర్తించి ప్రశ్నించదు. ప్రమాదం మధ్యలో నిలబడి నిజాన్ని వెతకదు.అది ఇంటర్నెట్‌లో ఇప్పటికే ఉన్న సమాచారాన్ని విశ్లేషించి కొత్త వాక్యాలను నిర్మిస్తుంది. అందువల్ల ఇంటర్నెట్‌లో తప్పు సమాచారం ఉంటే, అదే తప్పును మరింత విశ్వాసంతో తిరిగి చెప్పే ప్రమాదం ఉంటుంది.జర్నలిజంలో "ఎందుకు?" అనే ప్రశ్న అత్యంత ముఖ్యమైనది. ఏఐ ఎక్కువగా "ఏమైంది?" అనే ప్రశ్నకు సమాధానం చెబుతుంది. కానీ "ఎందుకు జరిగింది?", "దీనివల్ల ఎవరు నష్టపోయారు?", "ఎవరిని బాధ్యులను చేయాలి?" వంటి ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటే మానవ విచక్షణ అవసరం.

### హాల్యూసినేషన్... ఏఐ అతిపెద్ద బలహీనత

ఏఐ వ్యవస్థలలో అత్యంత ప్రమాదకరమైన సమస్య "హాల్యూసినేషన్". అంటే లేని సమాచారాన్ని ఉన్నట్లుగా చూపించడం లేదా తప్పుడు వివరాలను నిజంలా సమాధానంగా ఇవ్వడం.జర్నలిజంలో ఇది అత్యంత ప్రమాదకరం. ఒక తప్పుడు పేరు, ఒక తప్పు గణాంకం, ఒక కల్పిత కోట్ లేదా ఉనికిలో లేని నివేదిక ఆధారంగా ప్రచురితమైన వార్త లక్షలాది మందిని తప్పుదోవ పట్టించవచ్చు.అందుకే ఏఐ రూపొందించిన ప్రతి వాక్యం ఫ్యాక్ట్ చెకింగ్‌ను తప్పనిసరిగా దాటాలి.

### ప్రపంచ మీడియాకు వచ్చిన గుణపాఠాలు

ఏఐపై అతిగా ఆధారపడటం వల్ల ఇప్పటికే కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు విమర్శలు ఎదుర్కొన్నాయి.అమెరికాలోని ప్రముఖ టెక్నాలజీ మీడియా సంస్థ జచీజు ఆర్థిక కథనాల తయారీలో ఏఐని ఉపయోగించింది. తర్వాత ఆ కథనాల్లో అనేక వాస్తవపరమైన తప్పులు వెలుగులోకి రావడంతో వాటిని సవరించాల్సి వచ్చింది.అలాగే ప్రముఖ డిజిటల్ మీడియా సంస్థ +అఓఎశీఒశీ-ూ× రూపొందించిన వ్యాసాల్లో పలు వాస్తవపరమైన లోపాలు బయటపడటంతో విమర్శలు ఎదుర్కొంది.ఈ ఉదాహరణలు ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. ఏఐ వేగంగా రాయగలదు. కానీ నిజాన్ని నిర్ధారించే బాధ్యత మాత్రం మనిషిదే.

### కాపీరైట్... కొత్త యుద్ధం

ఏఐ అభివృద్ధితో మరో కీలక చర్చ ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా వార్తా సంస్థలు సంవత్సరాలుగా నిర్మించిన కంటెంట్‌ను ఏఐ మోడళ్లు శిక్షణ కోసం ఉపయోగిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.ఇది కేవలం సాంకేతిక సమస్య కాదు. మేధోసంపత్తి హక్కుల సమస్య.వేలాది జర్నలిస్టుల కష్టం, పరిశోధన, ఫీల్డ్ రిపోర్టింగ్, విశ్లేషణలపై నిర్మితమైన సమాచారాన్ని అనుమతి లేకుండా ఉపయోగిస్తే, ఒరిజినల్ జర్నలిజం ఆర్థికంగా బలహీనపడే ప్రమాదం ఉంది.ఏఐ సంస్థలు కూడా నాణ్యమైన జర్నలిజం కొనసాగాలంటే కంటెంట్ సృష్టికర్తలకు తగిన గుర్తింపు, పారితోషికం అందే విధానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

### అల్గారిథం... కనిపించని సంపాదకుడు

నేటి డిజిటల్ ప్రపంచంలో చాలామంది పాఠకులు వార్తాపత్రిక మొదటి పేజీ ద్వారా కాదు; సోషల్ మీడియా ఫీడ్ ద్వారా వార్తలను చూస్తున్నారు.ఈ క్రమంలో ఏ వార్త ముందుకు రావాలి? ఏది వెనుకపడాలి? అనే నిర్ణయాన్ని సంపాదకుడు కాకుండా అల్గారిథం తీసుకుంటోంది.ఒక వ్యక్తి ఎక్కువగా రాజకీయ వార్తలు చూస్తే అతనికి మళ్లీ అదే తరహా వార్తలే కనిపిస్తాయి. మరో వ్యక్తి వినోద వార్తలు చదివితే అతనికి అదే ప్రపంచం కనిపిస్తుంది.ఈ పరిస్థితినే డిజిటల్ విశ్లేషకుడు ఎలి పారిసర్ "ఫిల్టర్ బబుల్"గా వివరించారు. భిన్న అభిప్రాయాలు కనిపించకుండా పోవడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరమైన పరిణామం కాదు.

### ఉపాధిపై ప్రభావం

ఏఐ రావడంతో మీడియా సంస్థలు ఖర్చు తగ్గించే మార్గాలను వెతుకుతున్నాయి. సాధారణ అనువాదాలు, ప్రెస్ నోట్లు, చిన్న వార్తల తయారీ, సోషల్ మీడియా పోస్టుల రూపకల్పన వంటి పనుల్లో ఏఐ వినియోగం పెరుగుతోంది.దీనివల్ల కొన్ని ఉద్యోగాల స్వరూపం మారవచ్చు. కానీ అదే సమయంలో కొత్త నైపుణ్యాల అవసరం కూడా పెరుగుతోంది. ఏఐను ఉపయోగించి డేటా జర్నలిజం చేయగల జర్నలిస్టులు, ఫ్యాక్ట్ చెకర్లు, ఏఐ ఎడిటర్లు, వెరిఫికేషన్ నిపుణులకు భవిష్యత్తులో మరింత డిమాండ్ ఉండే అవకాశం ఉంది.అందువల్ల సమస్య ఏఐ రావడంలో లేదు. దానికి అనుగుణంగా మీడియా రంగం తనను తాను ఎలా మార్చుకుంటుందన్నదే కీలకం.

### భవిష్యత్తు పోటీ మనిషి వర్సెస్ ఏఐ కాదు

చాలామంది భావిస్తున్నట్లుగా భవిష్యత్తు పోటీ జర్నలిస్టు వర్సెస్ ఏఐ కాదు. ఏఐని సమర్థంగా వినియోగించే జర్నలిస్టు, వినియోగించని జర్నలిస్టు మధ్యే పోటీ ఉండే అవకాశం ఉంది.అయితే ఒక విషయం మాత్రం స్పష్టం. ఎలాంటి సాంకేతికత అయినా వార్తల నైతికతకు, ఫ్యాక్ట్ చెకింగ్‌కు, ప్రజాప్రయోజనానికి ప్రత్యామ్నాయం కాలేదు.ఏఐ జర్నలిజానికి శత్రువు కాదు. అలాగే అది జర్నలిజానికి వారసుడు కూడా కాదు. అది ఒక శక్తివంతమైన సాధనం మాత్రమే. కలం పట్టేది మనిషి కావాలి. ప్రశ్నించేది మనిషే కావాలి. అధికారాన్ని నిలదీయేది మనిషే కావాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో వార్తలు తయారు చేయడం ఒక సాంకేతిక ప్రక్రియ కాదు; అది ఒక ప్రజా బాధ్యత.సాంకేతికత వేగాన్ని ఇస్తుంది. కానీ విలువలను ఇవ్వదు. అల్గారిథం సమాచారాన్ని అందిస్తుంది. కానీ మనస్సాక్షిని ఇవ్వదు. ఏఐ అక్షరాలను రాయగలదు. కానీ ఆ అక్షరాలకు ఆత్మను, నైతికతను, ప్రజా బాధ్యతను ఇవ్వగల శక్తి ఇప్పటికీ జర్నలిస్టు కలానికే ఉంది.అందుకే మీడియా భవిష్యత్తు ప్రశ్న ఒకటే- ఏఐని ఉపయోగించే జర్నలిజమా? లేక ఏఐ చేత నడిపించబడే జర్నలిజమా? ఈ రెండింటి మధ్య ఉన్న తేడానే ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్ణయించబోతోంది.




# రాజకీయ సమీకరణాల పునర్నిర్మాణమా?

భారతదేశంలో ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ప్రక్రియగా గుర్తింపు పొందాయి. కోట్లాది మంది ఓటర్లు, లక్షలాది పోలింగ్ కేంద్రాలు, వేలాది అభ్యర్థులతో నిర్వహించే ఈ ఎన్నికల వ్యవస్థకు మూలాధారం ఒక్కటే ఓటర్ల జాబితా. ఒక ఓటు ఒక పౌరుడికి మాత్రమే ఉండాలనే రాజ్యాంగ సూత్రం ఎన్నికల నిష్పాక్షికతకు ప్రాణాధారం. అందుకే ఓటర్ల జాబితా కేవలం పరిపాలనా పత్రం కాదు; అది ప్రజాస్వామ్య విశ్వసనీయతకు కొలమానం. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన Special Intensive Revision (SIR) ఇప్పుడు రాజకీయ చర్చకు కేంద్రబిందువైంది. ఎన్నికల సంఘం దీనిని ఎన్నికల జాబితా ప్రక్షాళనగా అభివర్ణిస్తుండగా, ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఎన్నికల ముందు ఓటర్ల జాబితాలో జోక్యం చేసుకునే ప్రమాదకర ప్రక్రియగా విమర్శిస్తున్నాయి. ఈ రెండు వాదనల మధ్య ఉన్న వాస్తవాన్ని, సాంకేతిక అంశాలను, రాజకీయ ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించడం అవసరం.

### ఓటర్ల జాబితా ఎందుకు అంత కీలకం?

ఎన్నికల్లో ఓటు వేయడానికి పౌరసత్వం, వయస్సు మాత్రమే సరిపోవు. ఎన్నికల జాబితాలో పేరు ఉండటం కూడా తప్పనిసరి. అందువల్ల ఓటర్ల జాబితాలో జరిగే ప్రతి మార్పు నేరుగా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది మరణిస్తుంటారు. ఉద్యోగాలు, విద్య, వ్యాపారం, వివాహం వంటి కారణాలతో కోట్లాది మంది ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస వెళుతుంటారు. చాలామంది కొత్త ప్రాంతంలో ఓటు నమోదు చేసుకున్నా, పాత ప్రాంతంలో పేర్లు అలాగే కొనసాగుతుంటాయి. ఈ పరిస్థితులు డూప్లికేట్ నమోదులకు దారితీస్తాయి. అదే సమయంలో కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతను జాబితాలో చేర్చడం కూడా నిరంతర ప్రక్రియ. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలి, కానీ ఒక వ్యక్తికి ఒక్క ఓటే ఉండాలి.

### సాంకేతిక పరిజ్ఞానం ఎన్నికల ప్రక్రియలోకి

గతంలో ఎన్నికల జాబితా సవరణ ప్రధానంగా ఇంటింటి తనిఖీలు, స్థానిక అధికారుల నివేదికల ఆధారంగా జరిగేది. ప్రస్తుతం డిజిటల్ డేటాబేస్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫేషియల్ మ్యాచింగ్ టెక్నాలజీలు అందుబాటులోకి రావడంతో పరిశీలన మరింత విస్తరించింది. Demographically Similar Entries (DSE) విధానంలో ఒకే పేరు, తల్లిదండ్రుల వివరాలు, వయస్సు, చిరునామా వంటి వివరాల్లో అసాధారణ పోలికలు ఉన్న నమోదులను గుర్తిస్తారు. దీనివల్ల ఒకే వ్యక్తి రెండు ప్రాంతాల్లో నమోదు అయ్యే అవకాశాలను పరిశీలించవచ్చు.Photo Similar Entries (PSE) ద్వారా ఫోటో ఆధారంగా ఒకే వ్యక్తి వేర్వేరు నియోజకవర్గాల్లో నమోదు అయ్యాడా అనే విషయాన్ని గుర్తించే ప్రయత్నం జరుగుతుంది. ఇది తుది ఆధారం కాకపోయినా, అనుమానాస్పద నమోదులను గుర్తించేందుకు ఉపయోగపడుతుంది. అదనంగా, అందుబాటులో ఉన్న ప్రభుత్వ రికార్డులతో పరిమిత స్థాయిలో క్రాస్ వెరిఫికేషన్ ద్వారా మరణాలు, శాశ్వత వలసలు, ఇతర వివరాలను పరిశీలించే అవకాశం ఉంటుంది. అయితే ఆధార్ అనుసంధానం స్వచ్ఛందమేనని ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టం చేసింది.

### సాంకేతికత ఎంత బలమైనదైనా తప్పిదాల ప్రమాదం ఉంటుంది

సాంకేతిక పరిజ్ఞానం సామర్థ్యాన్ని ఎవరూ తిరస్కరించలేరు. కానీ అదే సమయంలో సాంకేతికత తప్పులేనిదీ కాదు. ఒకే పేరు, ఒకే వయస్సు, పోలికలున్న ఫోటోలు ఉన్నందున ఇద్దరు వేర్వేరు వ్యక్తులను ఒకరిగా గుర్తించే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేం. ముఖ్యంగా ఒకే ఇంటిపేరు, ఒకే గ్రామం, ఒకే కుటుంబ నేపథ్యం ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి పొరపాట్ల అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల సాఫ్ట్‌వేర్ ఇచ్చే సంకేతాలను తుది నిర్ణయాలుగా కాకుండా, క్షేత్రస్థాయి ధృవీకరణకు ఆధారంగా మాత్రమే ఉపయోగించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సంఘం కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నట్లు చెబుతోంది.

### రాజకీయ అనుమానాలు ఎందుకు పెరుగుతున్నాయి?

ఎన్నికల ముందు ఓటర్ల జాబితాలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకుంటే సహజంగానే రాజకీయ అనుమానాలు వ్యక్తమవుతాయి. ముఖ్యంగా గతంలో కొన్ని రాష్ట్రాల్లో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయినట్లు ఆరోపణలు రావడం వల్ల ఈ ప్రక్రియపై ప్రతిపక్షాల సందేహాలు మరింత పెరిగాయి. ప్రతిపక్షాల ప్రధాన వాదన ఏమిటంటే పట్టణాల్లో అద్దె ఇళ్లలో ఉండే వారు, విద్యార్థులు, వలస కార్మికులు, ఉద్యోగుల వంటి వర్గాలు తరచూ చిరునామాలు మారుస్తుంటారు. ఇలాంటి వర్గాల పేర్లు పొరపాటున తొలగిపోతే వారి ఓటు హక్కు దెబ్బతింటుందని వారు అంటున్నారు. మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం ప్రతి తొలగింపుకు ముందు నోటీసులు, అభ్యంతరాల స్వీకరణ, అప్పీల్ అవకాశాలు కల్పిస్తున్నామని చెబుతోంది. ప్రజాస్వామ్యంలో ఈ రెండు అంశాలు సమానంగా ముఖ్యమైనవే బోగస్ నమోదుల తొలగింపూ అవసరం, అర్హులైన ఓటర్ల హక్కుల రక్షణ కూడా అంతే అవసరం.

### దక్షిణాది రాష్ట్రాల్లో ప్రత్యేక పరిస్థితి

దక్షిణాది రాష్ట్రాల్లో పట్టణీకరణ, విద్యా వలసలు, ఐటీ ఉద్యోగాలు, అంతర్రాష్ట్ర ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉండటం వల్ల ఓటర్ల జాబితాలో మార్పుల స్వభావం ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా ఉంటుంది. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మధ్య ఉద్యోగ, వ్యాపార, కుటుంబ సంబంధాలు ఎక్కువగా ఉండటంతో రెండు రాష్ట్రాల్లో ఒకే వ్యక్తి పేరు నమోదై ఉండే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఒక వ్యక్తికి ఒకే రాష్ట్రంలో మాత్రమే ఓటు ఉండే విధంగా జాబితాలను సమన్వయం చేయడం పరిపాలనా దృష్ట్యా సహజమైన చర్యగా కనిపించినప్పటికీ, దీనివల్ల కొన్ని కీలక పట్టణ నియోజకవర్గాల్లో ఎన్నికల సమీకరణాలు మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ప్రభావం ఒకే పార్టీకి అనుకూలంగా ఉంటుందని ముందుగానే నిర్ధారించడం సాధ్యం కాదు. ప్రభావం స్థానిక జనాభా స్వభావం, వలసలు, నమోదైన మార్పుల పరిమాణంపై ఆధారపడి ఉంటుంది.

### ఎన్నికల గణాంకాల అర్థం మారుతుంది

SIR ప్రభావం కేవలం ఓటర్ల సంఖ్య తగ్గడంలో ఉండదు. ఎన్నికల గణాంకాల అర్థాన్నే మార్చే సామర్థ్యం దీనికి ఉంది. ఉదాహరణకు, ఒక బూత్‌లో వాస్తవంగా 800 మంది మాత్రమే ఓటు వేయగలిగే పరిస్థితిలో జాబితాలో 1,000 పేర్లు ఉంటే పోలింగ్ శాతం 80గా నమోదవుతుంది. అదే అనర్హులైన 200 పేర్లు తొలగితే, అదే 800 మంది ఓటు వేస్తే పోలింగ్ శాతం 100కు చేరుతుంది. అంటే ఓటర్ల ప్రవర్తన మారలేదు; కానీ గణాంకాల అర్థం మారింది. అలాగే తక్కువ మెజారిటీలతో గెలుపోటములు నిర్ణయమయ్యే అసెంబ్లీ నియోజకవర్గాల్లో చిన్న మార్పులు కూడా రాజకీయంగా గణనీయమైన ప్రభావం చూపవచ్చు. అయితే ఆ ప్రభావాన్ని ఏ ఒక్క పార్టీకి మాత్రమే ఆపాదించడం శాస్త్రీయంగా సరైన విశ్లేషణ కాదు.

### ఎన్నికల సంఘం ముందున్న సవాలు

SIR విజయాన్ని నిర్ణయించేది ఎన్ని లక్షల పేర్లు తొలగించారన్నది కాదు. ప్రతి తొలగింపుకు సరైన కారణం ఉందా? ప్రతి అర్హుడికి తన పేరు పునరుద్ధరించుకునే అవకాశం కల్పించారా? అభ్యంతరాల పరిష్కారం వేగంగా జరిగిందా? పారదర్శకత పాటించారా? అనే ప్రశ్నలే అసలు ప్రమాణాలు. ఎన్నికల సంఘం సాంకేతికతను ఉపయోగిస్తున్నప్పుడు ప్రజల విశ్వాసాన్ని కూడా సమానంగా కాపాడాల్సిన బాధ్యత ఉంది. ఎందుకంటే ఎన్నికల్లో ఓడిపోయిన పార్టీ కూడా ఫలితాలను అంగీకరించేలా ఎన్నికల వ్యవస్థపై నమ్మకం ఉండాలి. అదే ప్రజాస్వామ్య బలం.

### పౌరుల బాధ్యత కూడా అంతే ముఖ్యం

ఈ ప్రక్రియలో ప్రభుత్వ బాధ్యత ఎంత ఉందో, పౌరుల బాధ్యత కూడా అంతే ఉంది. ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో, వివరాలు సరిగ్గా నమోదయ్యాయో లేదో ప్రతి ఓటరు స్వయంగా నిర్ధారించుకోవాలి. ఎన్నికల సమయంలో మాత్రమే కాదు, జాబితా సవరణ జరుగుతున్న సమయంలోనే తన హక్కును పరిరక్షించుకోవడం ఉత్తమ మార్గం. Special Intensive Revisionను పూర్తిగా ప్రజాస్వామ్య రక్షణగా కూడా చూడలేం; పూర్తిగా రాజకీయ కుట్రగా కూడా కొట్టిపారేయలేం. అది ఎలా అమలవుతుందన్నదే అసలు పరీక్ష. నిజమైన ప్రజాస్వామ్యంలో రెండు లక్ష్యాలు ఒకేసారి నెరవేరాలి అనర్హులైన నమోదులు తొలగిపోవాలి; అర్హులైన ఒక్క ఓటరైనా అన్యాయంగా జాబితా నుంచి తొలగిపోకూడదు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాల కంటే ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసం గొప్పది. ఆ విశ్వాసాన్ని బలపరిచే దిశగా SIR ముందుకు సాగితే అది ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది. లేదంటే అదే ప్రక్రియ రాజకీయ అనుమానాలకు, న్యాయ వివాదాలకు, ప్రజాస్వామ్యంపై సందేహాలకు కారణమవుతుంది. అందుకే ఓటర్ల జాబితా ప్రక్షాళనను కేవలం సంఖ్యల వ్యాయామంగా కాకుండా, ప్రజాస్వామ్య విశ్వసనీయతకు సంబంధించిన అత్యంత సున్నితమైన బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉంది.



# భారత సైన్యానికి కొత్త బాస్..

**న్యూ ఢిల్లీ :** భారత సైన్యానికి కొత్త బాస్‌గా జనరల్ ధీరజ్ సేథ్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆర్మీ చీఫ్‌గా సేవలందించిన జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 31వ ఆర్మీ చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతలు చేపట్టారు. ఈ అత్యున్నత బాధ్యతలను స్వీకరించడానికి ముందు ఆయన దేశానికి వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా సేవలందించారు. జనరల్ ధీరజ్ సేథ్ నియామకంతో భారత సైన్యంలో ఒక అరుదైన రికార్డ్ నమోదైంది. 1997 తర్వాత ఆర్మర్డ్ కోర్ (టాంక్ రెజిమెంట్) విభాగం నుంచి భారత సైన్యాన్ని నడిపించే అత్యున్నత బాధ్యతను దక్కించుకున్న మొదటి అధికారి ఆయనే కావడం విశేషం. 1986 డిసెంబర్‌లో '2వ లాన్సర్స్' రెజిమెంట్‌లో కమిషన్డ్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించిన జనరల్ ధీరజ్ సేథ్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ మిలిటరీ అనుభవం ఉంది. తన కెరీర్‌లో పాకిస్తాన్ సరిహద్దులతో ముడిపడి ఉన్న అత్యంత వ్యూహాత్మకమైన 'సదరన్ కమాండ్', 'సౌత్ వెస్ట్రన్ కమాండ్' రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా వ్యవహరించిన అరుదైన ఘనత ఆయన సొంతం. జమ్మూ కాశ్మీర్‌లో కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్, ఐక్యరాజ్యసమితి శాంతిభద్రతల మిషన్‌లో పనిచేసిన ఆయన విశిష్ట సేవలకు గానూ పరమ విశిష్ట సేవా మెడల్ , ఉత్తమ యుద్ధ సేవా మెడల్ లభించాయి. సైన్యంలో ఆధునిక సాంకేతికత, డ్రోన్ల వినియోగాన్ని పెంచడం మరియు ఇంటిగ్రేటెడ్ బ్యాటిల్ గ్రూప్స్ ల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

# తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన సంజయ్ జాజు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన మంగళవారం అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేటితో పదవీ విరమణ చేయనుండటంతో, ఆయన స్థానంలో సంజయ్ జాజును నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

**ఉమ్మడి ఏపీలో కీలక బాధ్యతలు..**

1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజుకు పరిపాలనా రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన పలు కీలక పోస్టుల్లో బాధ్యతలు నిర్వర్తించారు. విజయవాడ సబ్ కలెక్టర్‌గా ప్రస్థానం ప్రారంభించిన ఆయన.. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, కమిషనర్‌గా సేవలు అందించారు. అలాగే పౌరసరఫరాల సంస్థ కమిషనర్‌గా కూడా పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

**కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్రానికి..**

ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం, 2014 నుంచి సంజయ్ జాజు కేంద్ర సర్వీసుల్లో కొనసాగుతున్నారు. కేంద్రంలో వివిధ కీలక శాఖల్లో తన మార్క్ చూపించిన ఆయన, తాజాగా తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు చేపట్టేందుకు తిరిగి రాష్ట్ర సర్వీసులోకి వచ్చారు. సీఎస్ బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో కొనసాగనున్నారు. సుదీర్ఘ కాలం పాటు ఆయన ఈ పదవిలో ఉండనుండటంతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు, వేగం పుంజుకునే అవకాశం ఉందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలువురు ఐఏఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ పోలీసులపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆగ్రహం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కస్టోడియల్ డెత్ కేసులో తెలంగాణ పోలీసుల తీరుపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన దళిత యువకుడు రాజేష్ కస్టడీ మరణం కేసును సుమోటోగా స్వీకరించిన కమిషన్, ఈ దారుణంపై సమగ్ర విచారణ జరిపి 3 వారాల్లోగా పూర్తి నివేదిక సమర్పించాలని తెలంగాణ డీజీపీ మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

**థర్డ్ డిగ్రీ చిత్రహింసల వల్లే మృతి..?**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ కేసు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబ సభ్యులు, మానవ హక్కుల సంఘాల ఆరోపణల ప్రకారం.. దళిత యువకుడైన రాజేష్‌ను పోలీసులు ఎలాంటి పక్కా ఆధారాలు లేకుండా అక్రమంగా నిర్బంధించారు. విచారణ పేరుతో పోలీస్ స్టేషన్‌లో అతడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు ఉపయోగించారని, పోలీసుల దెబ్బలు తట్టుకోలేకే రాజేష్ కస్టడీలోనే ప్రాణాలు విడిచాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. లాకప్ డెత్‌కు కారణమైన బాధ్యులైన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌లు వస్తున్న నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ కేసును అత్యంత తీవ్రంగా పరిగణించింది. 3 వారాల గడువులోగా నివేదిక ఇవ్వని పక్షంలో తదుపరి చట్టపరమైన చర్యలు ఉంటాయని కమిషన్ పోలీసులకు స్పష్టం చేసింది.

# డ్రగ్స్ మాఫియా అసలు ఆట ఇదే!



## జీవితకాలం జైలే -సందీప్ శాండిల్య

"విలాసాల మాటేమో కానీ.. ఇలాంటి నేరాలు చేస్తే ఏకంగా జీవితకాలం జైలు ఊచలు లెక్కపెట్టక తప్పదు. నేరం ఎంత పక్కాగా చేసినా ఏనాటికైనా బయటపడుతుంది. తరచుగా విదేశాలకు వెళ్లేవారి ఫ్రీక్వెంట్ ఫ్లైయర్స్ డేటా, అనుమానాస్పద కదలికలపై గట్టి నిఘా పెట్టిన ఈగల్ ఫోర్స్ తొలుత ఈ అంతర్జాతీయ ముఠా గుట్టును పసిగట్టి కస్టమ్స్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, ఎన్సీబీతో కలిసి రెండు నెలల పాటు పక్కా స్కెచ్ వేసి మరీ కేలుస్కర్ ముఠా ఆట కట్టించాయి. ఈజీ మనీ ఆశచూపి ఉచిత విదేశీ ట్రిప్పులు ఆఫర్ చేసే ముఠాలతో అప్రమత్తంగా ఉండాలి" అని టీజీ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు.

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** 'ఫ్రీగా బ్యాంకాక్ ట్రిప్.. ఫైవ్ స్టార్ హోటల్‌లో వసతి.. అయితే వచ్చేటప్పుడు ఒక పార్శిల్ తీసుకురావాలి. రాగానే ఇంకో రూ. 25 వేల వరకు ఇస్తాం.' అంటూ ఈజీ మనీ పేరిట డ్రగ్స్ ముఠాలు యువతకు గాలం వేస్తున్నాయి. ఉచిత విదేశీ పర్యటనల ముసుగులో అమాయక యువత, సినీ అవకాశాల కోసం ఎదురుచూసే జూనియర్ ఆర్టిస్టులను మ్యూల్స్ (డ్రగ్స్ క్యారియర్లు)గా మారుస్తూ రూ. వందల కోట్ల డ్రగ్స్ దందా సాగిస్తున్న ఓ అంతర్జాతీయ ముఠా గుట్టును తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరోకు చెందిన ఈగిల్ బృందం, కేంద్ర దర్యాప్తు సంస్థలు సంయుక్తంగా రట్టు చేశాయి.

**కోట్లు కురిపించే ఓజీ..!**

బ్యాంకాక్ మార్కెట్లో కిలోకు రూ. 3 లక్షలకు లభించే హైడ్రోపోనిక్ గంజాయి (ఓజీ) ఇండియాలో రూ.80 లక్షల నుంచి రూ. కోటి వరకు పలుకుతోంది. దీని రవాణా కోసం స్మగ్లర్లు అమాయకులను పావులుగా వాడుకుంటున్నారు. ముంబైకి చెందిన హేమంగ్ ప్రమోద్ కేలుస్కర్ అనే కింగ్‌పిన్ ఈ భారీ నెట్‌వర్క్ కు మాస్టర్ మైండ్. ఇతని ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఏకంగా 300 మంది కుర్రాళ్లు క్యారియర్లుగా మారి ఈ దందా సాగిస్తున్నారంటే మాఫియా నెట్‌వర్క్ ఎంతలా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చు. సరుకు వస్తే కోట్లు వస్తాయి.. ఒకవేళ పట్టుబడితే మ్యూల్స్ బలవుతారు. ఇదే కేలుస్కర్ ముఠా మాస్టర్ ప్లాన్.

**ఒక్కడే 101 సార్లు ట్రిప్**

యూపీకి చెందిన తివారీ అనే యువకుడు ఏకంగా 101 సార్లు బ్యాంకాక్‌కు వెళ్లి వచ్చాడు. ఈ అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా వలలో తెలంగాణ యువత కూడా పడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా 14 మంది కుర్రాళ్లు ఈ ఉచ్చులో చిక్కుకోగా, వారి కదలికలపై పక్కా నిఘా పెట్టిన తెలంగాణ నార్కోటిక్స్ పోలీసులు ఇప్పటికే పది మందిని అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి నెట్టారు. ఈ హైడ్రోపోనిక్ గంజాయి వాడకాన్ని అరికట్టేందుకు డీఆర్ఐ 'ఆపరేషన్ వీడ్ అవుట్' పేరిట రంగంలోకి దిగింది. ముంబై, జైపూర్, లక్నో, కోల్‌కతాల్లో ఏకకాలంలో దాడులు చేసి 20 రోజుల్లో వంద కిలోలకు పైగా సరుకును పట్టుకుంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కస్టమ్స్ అధికారులు ఏకంగా రూ.700 కోట్ల విలువైన 1005 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని పట్టుకున్నారంటే ఈ సైలెంట్ స్మగ్లింగ్ ఏ స్థాయిలో జరుగుతోందో స్పష్టమవుతోంది.

# ప్రపంచాన్ని ఏకం చేస్తున్న సోషల్ మీడియా

**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** మనిషి మనుగడకు కమ్యూనికేషన్ (సమాచార మార్పిడి) కీలకం. ఇందుకు సోషల్ మీడియా ఓ మాధ్యమంగా మారింది. సోషల్‌మీడియా కొన్నేళ్లుగా ప్రపంచాన్ని ఒక్క చోటుకు చేర్చి మనుషుల మధ్య దూరాన్ని తగ్గించిన, విప్లవాత్మక మార్పులు తీసు కొచ్చింది. ఒకప్పుడు పక్షులు (పావురాలు, డేగలు, గ్రద్దలు), వేగులు, గూఢచారులు, ఉత్తర ప్రత్యుత్తరా లు, పత్రికలు, ఆ తర్వాత టెలిగ్రామ్‌లు, టెలిఫోన్‌ల ద్వారా సమాచారాన్ని తెలుసుకునేవారు. నాగరికత, నూతన ఆవిష్కరణలు పెరిగిన కొద్దీ మానవుడు మ రింత ముందుకు వెళ్లడంతో కంప్యూటర్‌లు, వాట్సాప్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, పేస్‌బుక్ వంటి ప్రసార మాధ్య మాలు బిలియన్ల ప్రజలను ఏకం చేస్తున్నాయి. సమాజంలోని మంచి చెడులపై సమాన ప్రభావ చూపు తున్నా దీని విలువ మాత్రం తగ్గడం లేదు. ప్రజలు సోషల్ మీడియా ద్వారా తమ భావాలను, అను భవాలను, అప్పటికప్పుడు జరిగిన సంఘటనలు, దృశ్యాలను ఇతరులతో పంచుకుంటున్నారు. మంగళ వారం ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం సం దర్భంగా ప్రత్యేక కథనం....నెట్‌వర్కింగ్, వ్యాపారంపై డిజిటల్ ప్లాట్‌ఫారమ్ లు చూపే ప్రగాఢ ప్రభావాన్ని గుర్తించడానికి ప్రతీ యేటా జూన్ 30న సోషల్ మీడియా దినోత్సవాన్ని జరుపుకుంటారు. మొదటి సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ 'సిక్స్ డిగ్రీస్' 1997లో వచ్చింది. తర్వాత అనే క ప్లాట్‌ఫామ్‌లు ఏర్పడ్డాయి. ఈ వేదిక ప్రజల మ మేకంతో పాటు విభిన్న సంస్కృతుల మధ్య సమా జం పరస్పరం వ్యవహరించే విధానాన్ని ఎలా మా రుస్తాయో తెలియజేస్తుంది. ప్రపంచ సోషల్ మీడి యా దినోత్సవాన్ని వార్తలు, టెక్నాలజీ వెబ్‌సైట్ అ యిన మాషబుల్2010 జూన్ 30న ప్రారంభించింది.

**మంచి, చెడులపై తీవ్ర ప్రభావం...**

సోషల్ మీడియా మంచి చెడులపై సమానంగా తన తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. దీన్ని మంచిగా వాడితే మేలు, చెడుగా ఉపయోగిస్తే కీడు సంభ విస్తోంది. ముఖ్యంగా యువత, విద్యార్థులపై దీని ప్రభావం ఎక్కువగా ఉంది. సోషల్ మీడియాలో వస్తు న్న పలు దృశ్యాలు, అంశాలు, దుర్మార్గాలు, అన్యాయ అక్రమాలు, అబద్ధ, అసత్య ప్రచారాలు, చెడు అలవా ట్లను వీక్షించి వాటికి బానిసలుగా మారి సంఘ విద్రో హ, సమాజ అభివృద్ధి నిరోధకులుగా మారి కటకటాలు లెక్కిస్తున్నారు. సోషల్ మీడియాలో పెట్టిన ఆయా రం గాలకు చెందిన వాటిని యుక్తా యుక్త విచక్షణతో స్వీకరిస్తే సమాజం బాగు పడుతుంది. సోషల్ మీడియాను వాడే వారెంత జాగ్రత్తగా ఉండాలో అప్‌లోడ్ చేసేవారు కూడా అంతే జాగ్రత్తగా ఉండాలి. సోషల్ మీడియా నియంత్రణ, విధివిధానాలపై ఓ చట్టం అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ప్రపంచవ్యాప్త ప్రభావం...**

సోషల్ మీడియా కేవలం ప్రొఫైల్‌ను పం చుకునే సాధనం నుంచి వార్తలు, క్రియాశీల త, జర్నలిజం, ఇ-కామర్స్‌కు ఒక కీలక సాధ నంగా పరిణామం చెందింది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 4.95 బిలియన్ల ప్రజలు సోషల్ మీడియాను చురుకుగా ఉపయోగిస్తు న్నారు. సగటు వినియోగదారుడు ప్రతీ రోజూ సోషల్ నెట్‌వర్క్‌లలో సుమారు 2 గంటల 27 నిమిషాలు గడుపుతున్నట్లు అంచనా.

**కనెక్ట్ కాని రంగమంటూ ఏదీ లేదు...**

వ్యక్తిగతంగా, వ్యవస్థాగతంగా సోషల్ మీడి యాకు కనెక్ట్ కాని రంగమంటూ ఏదీ లేదు. ఇందులో వ్యక్తి, కుటుంబం, సమాజం, విద్య, వైద్యం, వ్యాపారం, సమాచారం, ప్రకృతి, భూత, భవిష్యత్, వర్తమానాలు, చరిత్ర, సంస్కృతీ సాంప్రదాయాలు, సేవలు, మధుర స్మృతులు, స్పందనలు, ప్రతి స్పందనలు, సంఘటనలు వంటివి కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకు నేదాకా సోషల్ మీడియా జీవితంలో అంతర్భాగం అయింది.



# సింగరేణి అధికారుల పోరుబాట..

**గోదావరిఖని,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి అధికారుల పోరుబాట పట్టారు. హక్కుల కోసం రిలే నిరాహార దీక్షలకు దిగారు. కోల్ ఇండియా తరహా వేతన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని సింగరేణి అధికారులు డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని జీఎం ఆఫీస్ కార్యాలయం ముందు చేపట్టిన నిరాహార దీక్షలు సింగరేణి అధికారులు మాట్లాడారు. సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్జీ-1 ఏరియా అధికారులు రామగుండంలోని జీఎం కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో నిరసన కొనసాగిస్తున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి హక్కులను సాధించుకుంటామన్నారు. 2022-23, 2023-24, 2024-25 సంవత్సరాలకు సంబంధించిన పీఆర్పీ (పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కోల్ ఇండియా అధికారులతో సమానంగా పే అప్‌గ్రేడేషన్, ఇతర అలవెన్సులు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు దేశంలోని ఇతర బొగ్గు సంస్థల అధికారులతో సమాన స్థాయిలో పనిచేస్తున్నప్పటికీ, వేతనాలు మరియు కొన్ని ఆర్థిక ప్రయోజనాల విషయంలో వ్యత్యాసం కొనసాగుతోందని ప్రతినిధులు పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న అధికారులకు న్యాయమైన ప్రయోజనాలు అందడం లేదన్నారు. మూడు సంవత్సరాలుగా పీఆర్పీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మా సమస్యలను పరిష్కరించే దిశగా యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలి అని కోరారు. సింగరేణి కార్మికులు, అధికారులు సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సమస్యల పరిష్కారంలో ఆలస్యం ఎందుకు జరుగుతుందని అధికారులు ప్రశ్నిస్తున్నారు. హక్కుల సాధన కోసం శాంతియుత మార్గంలో నిరసన చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడం పై ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిందని, సంస్థకు ఆదాయం తీసుకువచ్చే అధికారులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం దీక్షలు చేయాల్సిన పరిస్థితి రావడం విచారకరం అని అధికారులు అన్నారు.

**దీక్షలకు సంఘీభావం..**

CMOAI RG-1 ఏరియా నాయకులు, వివిధ గనులకు చెందిన అధికారులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. డిమాండ్ల పరిష్కారం జరిగే వరకు దశలవారీగా రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ప్రతినిధులు స్పష్టం చేశారు. అధికారుల ఆందోళనపై సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే విషయం ఇప్పుడు ఆసక్తిగా మారింది. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు ఆర్ జీ 1 ప్రధాన కార్యదర్శి కోలా మల్లేష్, సి. శ్రీనివాస్ ఏజెంట్ జీడికే -11, సీఎంఓఏఐ అపెక్స్ ఉపాధ్యక్షులు, డా. రావుల దామోదర్ జాయింట్ సెక్రటరీ, సర్వే ఆఫీసర్, జీడికే 2&2A ఇంక్లైన్, ధీతి చంద్రమౌళి సీనియర్ సర్వే ఆఫీసర్, బి. కృష్ణ సీనియర్ అండర్ మేనేజర్, జీడికే -1 ఇంక్లైన్ తదితరులు పాల్గొన్నారు.

# అర్వపల్లి పీహెచ్‌సీలో అద్భుతం..

**అర్వపల్లి(జాజిరెడ్డిగూడెం),ఫ్లాష్ ఇండియా :** సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య బృందం ఓ గర్భిణీ మహిళకు అరుదైన పురుడు పోశారు. 4.4 కేజీల బరువున్న శిశువును చూసిన వారంతా బాల భీముడిగా వర్ణించడం కొసమెరుపు. ఇంతటి అసాధారణ కాన్పును కూడా సాధారణ ప్రసవం చేసి ప్రభుత్వ వైద్యం పై ప్రజలకు భరోసా కల్పించారు. డాక్టర్ నగేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన గర్భిణి గంగాధరి శిరీష పురిటి నొప్పులతో సోమవారం రాత్రి పీహెచ్ సీలో చేరారని తెలిపారు. వైద్య సిబ్బంది పరీక్షించి అర్ధరాత్రి తర్వాత సాధారణ సుఖ ప్రసవం చేయగా 4.4 కిలోల బరువుతో పండంటి మగ శిశువు జన్మించాడని అన్నారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా క్షేమంగా ఉన్నారని తెలిపారు.

గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల అపోహలను వీడి నాణ్యమైన వైద్య సేవలను పొంది, సిజేరియన్లకు అవకాశం ఇవ్వకుండా, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ డెలివరీలో నర్సింగ్ ఆఫీసర్లు బోడ సునీత, మాధవి, ఆశా కార్యకర్త రోజా, ఆయా శైలజ పాల్గొన్నారు.

# నర్సరీ @ రూ. 1 లక్ష!



**మహబూబ్‌నగర్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ హద్దు అదుపు లేకుండా సాగుతోంది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచుకునేందుకు ప్రైవేటు యాజమాన్యాలు సిద్ధమయ్యాయి. జిల్లా కేంద్రమైన మహబూబ్‌నగర్‌తో పాటు జడ్చర్ల, వనపర్తి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి వంటి పట్టణాలలో ఈ ఏడాది 'నేషనల్', 'ఇంటర్నేషనల్' బోర్డుల పేరిట కుప్పలు తెప్పలుగా కొత్త పాఠశాలలు వెలిశాయి. పోటీ పెరిగితే ఫీజులు తగ్గుతాయని ఆశించిన సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రుల అంచనాలను తలకిందులు చేస్తూ విద్యాసంస్థల నిర్వాహకులు భారీ ఎత్తున ఫీజులు నిర్ణయించి వసూళ్లకు తెగబడుతున్నారు.

**నర్సరీ చదువుకే.. అక్షరాలా లక్ష!**

కొత్తగా ఏర్పాటైన కార్పొరేట్ స్థాయి విద్యాసంస్థల్లో నర్సరీలో చేరే చిన్నారికి సైతం అక్షరాలా లక్ష ఫీజును నిర్ణయించినట్లు తెలుస్తోంది. కేవలం ఫీజు మాత్రమే లక్ష వసూలు చేస్తూ.. పుస్తకాలు, నోటు పుస్తకాలు, దుస్తులు, ఇతర సామాగ్రి పేరిట మరో రూ.30 వేల నుంచి రూ. 50 వేల రూపాయల వరకు గుంజుతున్నారు. ఇటు సాధారణ ప్రైవేటు పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అక్కడ కూడా విద్యా ఫీజు రూ. 50,000, బస్సు ఫీజు రూ. 20,000, పుస్తకాలు, ఇతర సామాగ్రి అంతా కలిపి ఏడాదికి లక్ష రూపాయలకు పైగానే వసూలు చేస్తుండటంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు.

**ఒకరిని మరొకరు దెబ్బ తీసుకునేలా..**

ఈ విద్యా వ్యాపారంలో తమకు అడ్డు రాకుండా ఉండేందుకు కొందరు కార్పొరేట్ నిర్వాహకులు సిండికేట్‌గా మారినట్లు సమాచారం. విద్యాశాఖలోని కొందరు అధికారులతో చేతులు కలిపి, తమకు వ్యతిరేకంగా ఉన్న చిన్న పాఠశాలల లోపాలను వెలికితీసి వాటిని దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఇదే అదునుగా భావించి కొన్ని సంఘాల ప్రతినిధులు, అధికారులు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇంత పెద్ద ఎత్తున అక్రమ విద్యా వ్యాపారం జరుగుతున్నా, అటు పాలకులు గానీ, ఇటు అధికార యంత్రాంగం గానీ కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

**తల్లిదండ్రులను బోల్తా కొట్టేలా ప్రచారాలు..**

తల్లిదండ్రులను, విద్యార్థులను ఆకట్టుకునేందుకు ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలు రంగురంగుల బ్రోచర్లు, భారీ ఫ్లెక్సీలతో విస్తృత ప్రచారాలు సాగిస్తున్నాయి. తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎంత ఖర్చైనా పెట్టడానికి వెనుకాడకూడదనే తల్లిదండ్రుల బలహీనతను ఈ సంస్థలు పెట్టుబడిగా మార్చుకుంటున్నాయి. విద్యాశాఖ నిబంధనలను బేఖాతరు చేస్తూ పాఠశాలల ప్రాంగణాల్లోనే పుస్తకాలు, దుస్తుల విక్రయాలు జరుపుతూ కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు స్పందించి, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగుతున్న ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజాసంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# 30 రోజుల్లో 7 బైక్‌ల చోరీ..



**చంపాపేట్,ఫ్లాష్ ఇండియా :** నగరంలో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఓ అలవాటు నేరస్థుడిని మలక్‌పేట పోలీసులు అరెస్టు చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.4 లక్షల విలువైన ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నిందితుడు డిగ్రీ విద్యార్థి కావడం, గతంలో జైలు శిక్ష అనుభవించిన తర్వాత కూడా నేరాలకు దూరం కాకపోవడం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హస్తినాపురానికి చెందిన బంద్రవల్లి రాకేష్ అలియాస్ రాఖీ అలియాస్ లడ్డు (23) ఎల్‌బీనగర్‌లోని అవినాష్ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. జూన్ 29న మలక్‌పేట క్రైమ్ బృందం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, మలక్‌పేటతో పాటు చైతన్యపురి, సరూర్‌నగర్, వనస్థలిపురం, నాగోల్, లాలాగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన ఏడు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దర్యాప్తులో నిందితుడి వద్ద నుంచి ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్, ఒక హోండా యాక్టివా, ఒక హోండా షైన్, నాలుగు స్ప్లెండర్ మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

**జైలు పరిచయాలే నేరాలకు దారి..**

2021లో నమోదైన పోక్సో కేసులో జైలుకు వెళ్లిన సమయంలో పలువురు ఆస్తి నేరస్థులతో పరిచయం ఏర్పడిందని, వారి ప్రభావంతో వరుసగా వాహనాల చోరీలకు అలవాటు పడ్డాడని పోలీసులు తెలిపారు. ఇటీవల కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో జైలు నుంచి విడుదలైన అనంతరం కూడా తన తీరు మార్చుకోకుండా మళ్లీ నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు. నిందితుడు తప్పుడు తాళం చెవులను ఉపయోగించి పార్కింగ్ ప్రాంతాల్లో ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, వాటిని హస్తినాపురం, సహారా ఎస్టేట్స్, పసుమాముల ప్రాంతాల్లో తనకు పరిచయమున్న వ్యక్తుల వద్ద దాచిపెట్టి, అనంతరం విక్రయించేందుకు ప్రయత్నించేవాడని దర్యాప్తులో తేలింది. కేవలం నెల రోజుల్లోనే ఏడు వాహనాలను అపహరించడం అతని నేరప్రవృత్తికి నిదర్శనమని పోలీసులు పేర్కొన్నారు.

**18కు పైగా కేసుల్లో నిందితుడు..**

రాకేష్ పై గతంలో బేగంపేట, వనస్థలిపురం, చైతన్యపురి, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్, కీసర పోలీస్ స్టేషన్లలో చోరీ, మోసం, పోక్సో తదితర కేసులతో కలిపి 18కు పైగా క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

**పోలీసుల సమన్వయంతో కేసు ఛేదన..**

ఈ కేసును మలక్‌పేట డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎల్.రాజా వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ కె. నర్సింహ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ధర్మిరెడ్డి గిరి ఆధ్వర్యంలో, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం. తేజ్యా నాయక్‌తో పాటు మలక్‌పేట క్రైమ్ స్టాఫ్ సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడిని అరెస్టు చేసి, చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమానులు తమ వాహనాలకు స్టీరింగ్/వీల్ లాక్స్ వంటి అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.



# ఓయూలో నిరుద్యోగుల భారీ ర్యాలీ..

**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను రద్దు చేసి సమగ్ర దర్యాప్తు జరపాలని, అలాగే రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి భారీ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఓయూ జేఏసీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం భారీ నిరుద్యోగ ర్యాలీ నిర్వహించారు. మెయిన్ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజ్ వరకు నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జార్జి రెడ్డి పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు మాట్లాడుతూ 2023 కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఫేక్ సర్టిఫికెట్లు, నకిలీ పత్రాల ఆధారంగా కొందరు రెగ్యులరైజ్ అయ్యారని, మొత్తం ప్రక్రియ పై సమగ్ర దర్యాప్తు చేపట్టి క్రమబద్ధీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని, 20 వేల ఖాళీలతో పోలీసు నియామకాలు, డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్వాతి, వేదాంత్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ రహదారిపై బస్సు లారీ ఢీ

**నకిరేకల్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పరిధిలోని ముత్యాలమ్మ గూడెం వద్ద మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం నుంచి హైదరాబాద్ వెళుతున్న ఇంటర్నెట్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముత్యాలమ్మ గూడెం వద్ద టైర్ పగిలిపోయింది. దీంతో ఆ బస్సు డివైడర్ను దాటుకొని హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న దారిలోకి వెళ్ళిపోయింది. అంతలోనే సూర్యాపేట వైపుకు వెళ్తున్న లారీ రావడంతో ఆ లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో 40 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నప్పటికీ కేవలం చిన్న గాయాలు మాత్రమే తగిలాయి. బలంగా బస్సు లారీని ఢీ కొట్టడంతో డ్రైవర్ బస్సులో చిక్కుకున్నారు. 108కు సమాచారం అందించడంతో అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి శ్రీనివాస్, పైలట్ సమీర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయాలైన ప్రయాణికులను ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంత పెద్ద మొత్తంలో ప్రమాదం జరిగినప్పటికీ ఎవరికి బలమైన గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


# కళాశాలల బంద్ విజయవంతం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు ప్రభుత్వం నేటికీ పూర్తిస్థాయిలో స్కాలర్షిప్ లు విడుదల చేయకపోవడంతో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కళాశాల బంద్ కు పిలుపునివ్వడం జరిగింది. ఆ సందర్భంగా మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో మంగళ వారం మిర్యాలగూడలో కళాశాలల బంద్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు చదువుకునే స్వేచ్ఛ లేకుండా పోయిందనీ,విద్యార్థులకు అందవలసినటువంటి పెండింగ్ ఫీజు బకాయిలు నేటికీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు నోచుకోలేని పరిస్థితి ఇక్కడ ఏర్పడ్డది, విద్యార్థులకు ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే స్కాలర్షిప్ల లు గత మూడు సంవత్సరాలుగా ఇవ్వకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలని వేధిస్తుండడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆయన అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ స్కాలర్షిప్ అందకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వమని అన్టున్నారాన్నారు. విద్యార్థులు వేడుకుంటే డబ్బులు చెల్లిస్తేనే ఇస్తామంటూ విద్యార్థులను వేధింపులకు గురి చేస్తా ఉన్నాయి. ప్రభుత్వం బీసీ విద్యార్థుల పెండింగ్ ఫీజు బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల చేసి బీసీ విద్యార్థులకు తోడుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు,యువజన సంఘం జిల్లా కన్వీనర్ సిద్ధం రాజు,పట్టణ నాయకులు పట్టేటి రమేష్,బీసీ యువజన సంఘం నియోజకవర్గ నాయకులు మునగాల శైలేందర్,పట్టణ కన్వీనర్ ఉపేందర్,రాజు,శంకర్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల మనిషి డాక్టర్ గడల శ్రీనివాసరావు..






**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మాజీ తెలంగాణ హెల్త్ డైరెక్టర్ మరియు తెలంగాణ రాష్ట్ర జనసేన నాయకులు హోదా ఉన్న లేకున్నా ప్రజలలో ఎల్లప్పుడూ ప్రజల సేవకై నిలిచే వ్యక్తి డాక్టర్ గడల శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలో ఉన్న అవంతిపురం లోని వృద్ధుల మరియు అనాధ ఆశ్రమంలో సుమారు 60 మందికి అన్న దానం మరియు కేక్ కటింగ్ నిర్వహించడం జరిగింది. ల్యాబ్ టెక్నీషియన్ ఏ.ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పేద ప్రజలు మరియు అన్ని వర్గాల ప్రజల కోసం పాటుపడే వ్యక్తి శ్రీనివాసరావు. వారు డాక్టర్ జి.ఎస్.ఆర్ ట్రస్టు ఏర్పాటు చేసి విద్యా,వైద్యం ఉపాధి ఉజ్వల భవిష్యత్తు కోసం ఎంతో పని చేసున్నారు. వైద్యరంగంలో పనిచేసే సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మనసు గెలుచుకున్నారు రాబోయే రోజుల్లో నిరంతరం పేద ప్రజలకు మరియు తెలంగాణ రాష్ట్రం కోసం పనిచేస్తారు అని వారి అభిమానులు తెలియజేశారు. రాష్ట్ర మొత్తం గడల శ్రీనివాసరావు టీం పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమరవరపు సుధీర్,గోవర్ధన్,నవీన్రెడ్డి,రాముడు,మనోజ్,భిక్షం,శ్యామ్,మధు,అంజి,సంతోష్ నాయక్ తదిదరులు ఉన్నారు.

# ఉచిత పశువైద్య శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ మండలంలోని హాట్యా తండా గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ మాంస పశు పరిశోధనా సంస్థ (ఖఅఎవతీ ణూాలూ) సహకారంతో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్అర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు మరియు పశుపాలకుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పాడి పశువుల ఆరోగ్యం మెరుగుపడితే రైతుల ఆర్థిక స్థితి మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశు వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. శిబిరంలో పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన చికిత్సలు,టీకాలు, మందులు ఉచితంగా అందించడంతో పాటు పశు పోషణ, వ్యాధి నివారణ, శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పశుసంవర్ధక శాఖ అధికారులు,జాతీయ మాంస పశు పరిశోధనా సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు,మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు.. లాభాలు బాగు



**వీపనగండ్ల,ఫ్లాష్ ఇండియా :** మండలంలోని సంపత్‌రావుపల్లి గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు శ్రీహరిరావు వ్యవసాయ క్షేత్రంలో 27 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి విజయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి జిల్లా ఉద్యాన అధికారి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, సాగునీటి వసతి (బోరు లేదా బావి) ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టడం ద్వారా దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ నాటిన మూడు సంవత్సరాల నుంచి పంట కోత ప్రారంభమవుతుందని, నెలకు రెండు సార్లు గెలల కోత చేపట్టవచ్చని వివరించారు. ఒకసారి నాటిన ఆయిల్ పామ్ తోటలు 25 నుంచి 30 సంవత్సరాల పాటు నిరంతర దిగుబడిని అందించి రైతులకు స్థిరమైన ఆదాయ వనరుగా నిలుస్తాయని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేందుకు ఆయిల్ పామ్ సాగు ఉత్తమ ప్రత్యామ్నాయమని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ నాగముని, ఉద్యాన అధికారి కృష్ణయ్య, ప్రీ యూనిక్ ఏరియా మేనేజర్ కెథన్ రెడ్డి, ఉద్యాన విస్తరణ అధికారి శిరీషతో పాటు సంపత్‌రావుపల్లి, తుంకుంట గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల నుంచి భారత్ గౌరవ్ యాత్రలు..

**సికింద్రాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలుగు రాష్ట్రాల భక్తుల కోసం ఐఆర్‌సీటీసీ రెండు ప్రత్యేక భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లను ప్రకటించింది. అయోధ్య--కాశీ పుణ్యక్షేత్ర యాత్ర, బైద్యనాథ్ ధామ్, దివ్య దక్షిణ యాత్ర, అరుణాచలం మీదుగా ప్రత్యేక యాత్రలను నిర్వహించనుంది. అయోధ్య--కాశీ పుణ్యక్షేత్ర యాత్ర రైలు జూలై 4న మధ్యాహ్నం 2 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరనుంది. ఈ యాత్రలో విష్ణుపద ఆలయం, కాశీ విశ్వనాథ్ ఆలయం, కాశీ విశాలాక్షి ఆలయం, అన్నపూర్ణ దేవి ఆలయం, గంగా హారతి, రామ జన్మభూమి, హనుమాన్ గఢి, త్రివేణి సంగమం, బైద్యనాథ్ ధామ్ వంటి పుణ్యక్షేత్రాలను సందర్శిస్తుంది. ఈ యాత్ర 9 రాత్రులు--10 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ రైలు తెలంగాణలోని సికింద్రాబాద్, చర్లపల్లి, కాజీపేట, వరంగల్, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో ఎక్కే, దిగే సౌకర్యం కల్పించారు. అలాగే, దివ్య దక్షిణ యాత్ర--అరుణాచలం ప్రత్యేక రైలు జూలై 20న ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరనుంది. ఈ యాత్రలో అరుణాచలేశ్వర ఆలయం, నటరాజ ఆలయం, శ్రీరంగనాథస్వామి ఆలయం, బృహదీశ్వర ఆలయం, రామనాథస్వామి ఆలయం, మీనాక్షి అమ్మవారి ఆలయం, వివేకానంద రాక్ మెమోరియల్, కన్యాకుమారి అమ్మవారి ఆలయం దర్శించే అవకాశం ఉంటుంది. ఈ



యాత్ర 8 రాత్రులు--9 రోజుల పాటు సాగుతుంది. ఈ రైలు తెలంగాణలోని సికింద్రాబాద్, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఎక్కే, దిగే సౌకర్యం కల్పించారు. ఈ ప్యాకేజీలో ప్రయాణం, శాకాహార భోజనాలు, ప్రయాణ బీమా, భద్రత, టూర్ ఎస్కార్ట్‌లు, ఐఆర్‌సీటీసీ టూర్ మేనేజర్ల సేవలు కూడా ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఐఆర్‌సీటీసీ టూరిజం వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

# ఇకనైనా నిర్లక్ష్యం వీడండి..

**లోకేశ్వరం,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాల పై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని కలెక్టర్ హెచ్చరించారు. మంగళవారం లోకేశ్వరం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఎలా చేస్తారని ఏఈఓను ప్రశ్నించి స్వయంగా కలెక్టర్ ఆధార్ కార్డు నంబర్ తో చేయించి పరిశీలించారు. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే ఒక రైతు ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తిచేయవచ్చని నిర్మల్ జిల్లాలో కేవలం 70 శాతం మాత్రమే ఈ ప్రక్రియ పూర్తయిందని మిగతా రైతుల ప్రక్రియ ఎందుకు పూర్తి చేయడం లేదని ఆయన డీఎఓను ప్రశ్నించారు. కొంతమంది రైతులు అందుబాటులో లేకపోవడం ఓటీపీ చెప్పకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్ కలెక్టర్ కు తెలిపారు. కాగా లోకేశ్వరం మండలంలో 90 శాతం ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తి చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి గిరిరాజ్ కలెక్టర్ కు నివేదికలు సూచించారు. మిగతా రైతులు మరణించడం గాని రెండు చోట్ల వ్యవసాయ భూములు ఉండడం వల్ల పూర్తి కాలేదని అన్నారు. ఇకనైనా ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసి నిర్మల్ జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చేలా చూడాలని కలెక్టర్ సూచించారు.





# తొలి టీ20లో వైభవ్ అరంగేట్రం..

ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఘోర పరాజయాలు చూసి పరువు మొత్తం పోగొట్టుకున్న భారత్.. ఇంగ్లండ్‌తో కీలక టీ20 సిరీస్‌కు సిద్ధమైంది. ఐర్లాండ్‌పై అపజయాలను మరిచి.. ఇంగ్లండ్ పర్యటనలో మంచి ఆరంభం అందుకోవాలని టీమిండియా భావిస్తోంది. చెస్టర్-లీ-స్ట్రీట్‌లోని రివర్‌సైడ్ గ్రౌండ్ వేదికగా జరిగే తొలి టీ20లో భారత్ మార్పులతో బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం దక్కనుంది. ఐపీఎల్ 2026లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న వైభవ్.. ఐర్లాండ్ సిరీస్‌లో బెంచ్‌కే పరిమితమైనప్పటికీ ఇప్పుడు ఇంగ్లండ్ గడ్డపై అంతర్జాతీయ అరంగేట్రానికి సిద్ధమయినట్లు సమాచారం. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత టాప్ ఆర్డర్ పూర్తిగా విఫలమైంది. ముఖ్యంగా ఓపెనర్ సంజు శాంసన్ నిరాశపరిచాడు. అయినప్పటికీ జట్టు యాజమాన్యం అతనిపై మరోసారి విశ్వాసం ఉంచిందట. ఇంగ్లండ్‌తో జరిగే తొలి టీ20లో కూడా సంజుకు అవకాశం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మ్యాచ్‌లో రాణించి విమర్శలకు సమాధానం చెప్పాలని అతడు లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో భారత్ కొత్త ఓపెనింగ్ జోడితో బరిలోకి దిగనుంది. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా ఆడనునట్లు తెలుస్తోంది. ఇషాన్ కిషన్ మూడో స్థానంలో ఆడనున్నాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాలుగో స్థానంలో, కీపర్ సంజు శాంసన్ ఐదో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. ఆల్‌రౌండర్లుగా శివమ్ దూబే, అక్షర్ పటేల్ ఆడే అవకాశాలు ఉన్నాయి. బౌలింగ్ విభాగంలో హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ పేస్ బాధ్యతలు చేపట్టనుండగా.. ఏకైక స్పిన్నర్‌గా రవి బిష్ణోయ్ ఆడనున్నాడు. ఇంగ్లండ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వేగం, స్పిన్ సమతుల్యతతో భారత జట్టు కూర్పును సిద్ధం చేసింది. వైభవ్ సూర్యవంశీ ఎంట్రీతో ఐర్లాండ్‌తో జరిగిన రెండో టీ20లో అరంగేట్రం చేసిన సూర్యాన్ష్ షెడ్గే తుది జట్టులో చోటు కోల్పోనున్నాడు.

**ఇంగ్లండ్‌తో తొలి టీ20లో భారత తుది జట్టు:**

వైభవ్ సూర్యవంశీ
అభిషేక్ శర్మ
ఇషాన్ కిషన్
శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్)
సంజు శాంసన్ (కీపర్)
శివమ్ దూబే
అక్షర్ పటేల్
హర్షిత్ రాణా
ప్రిన్స్ యాదవ్
అర్ష్‌దీప్ సింగ్
రవి బిష్ణోయ్

# కెప్టెన్ ఎంపికపై బీసీసీఐ కీలక నిర్ణయం!



ఈ ఏడాది సెప్టెంబర్‌లో జపాన్‌లోని ఐచి-నగోయా నగరంలో జరగనున్న ఆసియా క్రీడలు 2026 (ాంంఖుఅ +ఖుఎవం 2026) కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి 15 మంది సభ్యులతో కూడిన భారత మహిళల జట్టును ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్‌ను కెప్టెన్సీ నుంచి తొలగిస్తున్నారని గత కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రచారానికి బీసీసీఐ చెక్ పెట్టింది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్‌కు స్టార్ ఆల్‌రౌండర్ హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు ప్రకటించారు. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన వైస్-కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనుంది. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచకప్ 2026 లో భారత జట్టు గ్రూప్ స్టేజ్ లోనే (దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయి) టోర్నీ నుంచి నిష్క్రమించిన నేపథ్యంలో.. 35 ఏళ్ల హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీపై అనేక విమర్శలు వచ్చాయి. గత ఏడాది స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టు, ఈ టీ20 ప్రపంచకప్‌లో వ్యూహాత్మక లోపాలు, మైదానంలో చేసిన తప్పిదాల వల్ల ఘోరంగా విఫలమైంది. అయినప్పటికీ, బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఆమెపైనే నమ్మకం ఉంచి ఆసియా క్రీడల సారథ్య బాధ్యతలను అప్పగించింది. మరోవైపు, భారత మహిళల క్రికెట్ జట్టు లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ కు అర్హత సాధించిన మరుసటి రోజే ఈ ఆసియా క్రీడల జట్టును ప్రకటించడం విశేషం. మడమ గాయం కారణంగా ప్రస్తుత టీ20 ప్రపంచకప్‌కు దూరమైన యువ ఆల్‌రౌండర్ శ్రేయాంక పాటిల్‌ను మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లో జరగనున్న ఈ ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది.

**ఆసియా క్రీడలు 2026కి భారత మహిళల జట్టు:**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్-కెప్టెన్), షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్ (ఫిట్‌నెస్‌కు లోబడి), రాధా యాదవ్, నందిని శర్మ.

# భారత మహిళల క్రికెట్ జట్టు ప్రకటన



జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా ఈ సంవత్సరం సెప్టెంబర్‌లో జరగనున్న ఆసియా గేమ్స్ 2026 కోసం భారత మహిళల క్రికెట్ జట్టును బీసీసీఐ మహిళల సెలక్షన్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. గత ఆసియా గేమ్స్‌లో (చైనాలోని హాంగ్జౌలో) స్వర్ణ పతకం సాధించిన టీమిండియా.. ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా అత్యంత పటిష్టమైన జట్టుతో బరిలోకి దిగుతోంది.

**హర్మన్‌ప్రీత్ కెప్టెన్.. జట్టు వివరాలు**

ఈ మెగా టోర్నీకి హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, విధ్వంసకర ఓపెనర్ స్మృతి మంధాన వైస్-కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనుంది. జట్టులో యువ బ్యాటర్ షఫాలీ వర్మ, రోడ్రిగ్స్, దీప్తి శర్మలతో పాటు వికెట్ కీపర్‌గా రిచా ఘోష్ కీలక పాత్ర పోషించనున్నారు. అలాగే శ్రేయాంక పాటిల్ ఎంపిక పూర్తిగా ఆమె ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని బోర్డు గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**భారత మహిళల పూర్తి స్క్వాడ్:**


హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), భారతి ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్ (ఫిట్‌నెస్‌కు లోబడి), రాధా యాదవ్, నందిని శర్మ.

# పంజాబ్ కింగ్స్‌కు ఎదురుదెబ్బ..



పంజాబ్ కింగ్స్ డేంజర్ ఆటగాడు శశాంక్ సింగ్ సరికొత్త వివాదంలో చిక్కుకున్నాడు. శశాంక్ సింగ్, ఆయన తండ్రి మాజీ ఐపీఎస్ శైలేష్ సింగ్ పై కేసు నమోదు అయింది. కొత్తగా పనిలో చేరిన వంట మనిషిని హింసించి, తీవ్రంగా దాడి చేసిన ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గత కొన్ని రోజులుగా తనను దూషిస్తూ మానసికంగా హింసిస్తుండే వారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో శశాంక్ ఫ్యామిలీపై కేసు నమోదు అయింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని రేవా ప్రాంతానికి సంబంధించిన విపేంద్ర సింగ్, ఇటీవల భోపాల్ లో నివాసం ఉంటున్న శశాంక్ సింగ్ ఇంట్లో వంట మనిషిగా చేరాడు. ఈ క్రమంలో అతనికి 15 వేల జీతం, వసతితో పాటు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి, వంట మనిషిగా శశాంక్ ఫ్యామిలీ పెట్టుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇక పనిలో చేరిన నాలుగు రోజులకే, విపేంద్ర సింగ్ వండిన వంటలు బాగుండటం లేవంటూ శశాంక్ సింగ్ ఫ్యామిలీ తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేసింది. దూషించడంతో పాటు దారుణంగా కొట్టినట్లు సమాచారం. ఇక తాను అక్కడ ఉండలేనని, బయటకు వచ్చే ప్రయత్నం చేస్తే శశాంక్ సింగ్, అతని తండ్రి శైలేష్ సింగ్, ఇంటి డ్రైవర్ కలిసి విపేంద్ర సింగ్ పై క్రూరంగా భౌతిక దాడి చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఫోన్ కూడా లాగేసుకున్నారని బాధితుడు పేర్కొన్నారు. ఇక ఈ దాడి నేపథ్యంలో గాయాలతోనే రాతీ బఢ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు విపేంద్ర సింగ్ తోమర్. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటనపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

# బిజినెస్




# మరోసారి భారీగా తగ్గిన ధరలు

పశ్చిమాసియాలో యుద్ధ భయాలు, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ కారణంగా బంగారం ధరలు గత ఆకాశమే హద్దుగా పెరిగిన విషయం తెలిసిందే. తాజాగా అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం తగ్గడంతో దేశీయంగా బంగారం ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. ఈ క్రమంలో కొనుగోలుదారులకు భారీ ఉపశమనం కలిగిస్తూ ఈరోజు మార్కెట్లో బంగారం ధరలు భారీ పతనాన్ని నమోదు చేశాయి. హైదరాబాద్‌తో పాటు దేశంలోని ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల (మేలిమి) బంగారం ధర ఏకంగా రూ. 1,800 మేర తగ్గింది. ఈ భారీ తగ్గింపుతో ప్రస్తుతం మార్కెట్లో దీని ధర రూ. 1,40,130 వద్ద కొనసాగుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల (ఆభరణాల) బంగారం ధర కూడా రూ. 1,650 మేర క్షీణించింది. ఈ పతనంతో 22 క్యారెట్ల పసిడి రేటు ప్రస్తుతం రూ. 1,28,450 కి చేరింది.

**స్థిరంగా వెండి ధరలు**

బంగారం ధరలు భారీగా తగ్గినప్పటికీ, వెండి ధరలు మాత్రం మార్కెట్లో స్థిరంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 2,45,000 వద్ద విక్రయించబడుతోంది. పెళ్లిళ్ల సీజన్ ముగియడం, అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్స్‌కు మొగ్గు చూపడం వల్లే పసిడి ధరలు ఈ స్థాయిలో తగ్గుముఖం పట్టాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# రెండో రోజూ నష్టాలే..





సోమవారం నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు మంగళవారం కూడా అదే బాటలో సాగుతున్నాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి (94.61) బలహీనపడడం ప్రతికూలంగా మారింది. అలాగే ఎల్‌నినో కారణంగా వర్షపాతం లోటు భారీగా ఉంటుందనే అంచనాలు కూడా నెగిటివ్‌గా మారాయి. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో కదలాడుతున్నాయి. అయితే బ్యాంక్ నిఫ్టీ మాత్రం లాభాల్లో ఉంది. గత సెషన్ ముగింపు (76,728)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం లాభాలతో మొదలైన సెన్సెక్స్ వెంటనే నష్టాల్లోకి జారుకుంది. ఒకదశలో దాదాపు 600 పాయింట్లు కోల్పోయింది. అయితే ఆ తర్వాత కాస్త కోలుకుంది. ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 170 పాయింట్ల నష్టంతో 76,558 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా అదే బాటలో సాగుతోంది. ప్రస్తుతం 60 పాయింట్ల నష్టంతో 23,885 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో భారత్ డైనమిక్స్, సమ్మన్ క్యాపిటల్, జీఎమ్‌ఆర్ ఎయిర్‌పోర్ట్స్, ఏబీ క్యాపిటల్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఎయిచర్ మోటార్స్, కేపీఐటీ టెక్, టాటా కన్జ్యూమర్ ప్రోడక్ట్స్, భారత్ ఫోర్జ్, నాల్కో మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 61 పాయింట్ల లాభంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 21 పాయింట్ల నష్టంతో ఉంది.

# స్టార్టప్‌లతో చేతులు కలిపిన మారుతీ సుజుకి




ఎలక్ట్రిక్ వాహనాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని దేశీయ ప్యాసింజర్ వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకి ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. కంపెనీ తన ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఐదు స్టార్టప్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. వీటిలో మినీమైన్స్ అనే స్టార్టప్ కాలం చెల్లిన లిథియం-అయాన్ బ్యాటరీలను సురక్షితంగా రీసైక్లింగ్ చేసి, వాటిలోని విలువైన లోహాలను తిరిగి వినియోగంలోకి తీసుకురావడంపై పనిచేస్తుంది. మిగిలిన నాలుగు స్టార్టప్‌లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), జనరేటివ్ ఏఐ ఆధారంగా కొనుగోలు ప్రక్రియలను ఆటోమేట్ చేయడం, కస్టమర్ సేవలను మెరుగుపరచడం, బ్రాండ్ విజిబిలిటీ పెంచడం, సాఫ్ట్‌వేర్ అభివృద్ధిని వేగవంతం చేయడం వంటి పరిష్కారాలను అందించనున్నాయి. వ్యాపార సమస్యలకు వినూత్న పరిష్కారాలు కనుగొనడంలో స్టార్టప్‌లు కీలక భాగస్వాములుగా మారుతున్నాయని కంపెనీ ఎండీ, సీఈఓ హిసాషి టకేయుచి అన్నారు. ఈవీ బ్యాటరీ రీసైక్లింగ్‌తో పాటు, ఏఐ ఆధారిత పరిష్కారాల ద్వారా కస్టమర్ ఎక్స్‌పీరియన్స్‌ని మెరుగుపరచడం, సంస్థ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా మార్చడమే ఈ ఒప్పందాల లక్ష్యమని వివరించారు.





# అమెజాన్ ప్రైమ్ డే సేల్..

ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ తన 'ప్రైమ్ డే 2026' సేల్‌కు సంబంధించిన ఆఫర్లను ప్రకటించింది. మూడు రోజుల మెగా షాపింగ్ ఈవెంట్ జూలై 4 నుంచి 6 వరకు జరగనుంది. ఇది కేవలం ప్రైమ్ సభ్యులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈసారి 10వ వార్షికోత్సవం సందర్భంగా 300కుపైగా బ్రాండ్‌ల నుంచి 15,000కు పైగా ఉత్పత్తులపై ప్రత్యేక డిస్కౌంట్లు ఇవ్వనుంది. అంతేకాకుండా, 500కుపైగా కొత్త ఉత్పత్తులను కూడా ఈ సేల్‌లోనే మార్కెట్లోకి తీసుకురానుంది. స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, స్మార్ట్ హోమ్ డివైజ్‌లు, గృహోపకరణాలు, ఫ్యాషన్ ఉత్పత్తులు తదితర విభాగాల్లో భారీ ఆఫర్లు ఉండనున్నాయి. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో శాంసంగ్ ఎస్25 అల్ట్రా రూ. 84,999కే లభించనుండగా, రూ. 15,000 వరకు తగ్గింపు, 9 నెలల నో-కాస్ట్ ఈఎంఐ కూడా అందుబాటులో ఉంటుంది. వన్‌ప్లస్ 13 రూ. 49,999కు, ఐఫోన్ 17 సిరీస్, వన్‌ప్లస్ నార్డ్ 6, రెడ్‌మీ ఏ7 ప్రో 5జీ, ఐకూ 15ఆర్ వంటి మోడళ్లపై కూడా ఆఫర్లు ఇస్తున్నట్టు అమెజాన్ తెలిపింది. స్మార్ట్‌ఫోన్‌లతో పాటు ట్యాబ్లెట్‌లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, ఆడియో ఉత్పత్తులపైనా ఆకర్షణీయమైన డీల్స్ ఉన్నాయి. ఎం3 ఐప్యాడ్ ఎయిర్ రూ. 54,999కు, అదనంగా రూ. 3,000 వరకు బ్యాంక్ డిస్కౌంట్‌తో లభిస్తుంది. సోనీ బ్రావియా 2 55-అంగుళాల టీవీ రూ. 52,999కు, టీసీఎస్ క్యూఎల్ఈడీ టీవీ రూ. 38,999 నుంచి, జేబీఎల్ బార్ 800 ప్రో సౌండ్‌బార్ రూ. 49,999కు అందుబాటులోకి రానుంది. ఎకో డాట్ (5వ జనరేషన్) రూ. 3,999కు, ఎకో పాప్ రూ. 2,949కు, ఫైర్ టీవీ స్టిక్ హెచ్‌డీ రూ. 2,999కు, ఫైర్ టీవీ స్టిక్ 4కె ప్లస్ రూ. 4,499కు విక్రయించనున్నారు. కొత్త ప్రైమ్ ఏడాది మెంబర్‌షిప్ రూ. 999కే అందిస్తుండగా, ప్రైమ్ లైట్ రూ. 599కు, ప్రైమ్ షాపింగ్ ఎడిషన్ రూ. 299కు లభిస్తుంది. ఎంపిక చేసిన ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్ కార్డులపై 10 శాతం వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్, అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డుపై అదనపు క్యాష్‌బ్యాక్ కూడా వినియోగదారులకు అందించనున్నట్టు కంపెనీ వెల్లడించింది.




# 'ఇరుముడి కట్టు' సాంగ్ వచ్చేసింది

తాజాగా విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు ఈ భక్తి గీతం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. జి.వి. ప్రకాష్ కుమార్ స్వరపరిచిన 'ఇరుముడి కట్టు' పాట అయ్యప్ప స్వామి భక్తి, మండల దీక్ష, శబరిమల యాత్ర నేపథ్యాన్ని ఆధ్యాత్మిక భావోద్వేగాలతో ఆవిష్కరించింది. ఈ పాటకు దర్శకుడు శివ నిర్వాణ, కళ్యాణ్ చక్రవర్తి కలిసి సాహిత్యం అందించగా, అనంతు తన గాత్రంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ పాటలో అయ్యప్ప మాల ధరించిన భక్తుడి పాత్రలో రవితేజ లుక్, హావభావాలు ఆకట్టుకుంటాయి. అలాగే ప్రియా భవానీ శంకర్, బేబీ నక్షత్ర కనిపించే భావోద్వేగ సన్నివేశాలు పాటకు మరింత బలాన్ని చేకూర్చాయి. బాబా భాస్కర్ కొరియోగ్రఫీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. గత కొంతకాలంగా రవితేజ నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాలను అందుకోలేకపోయాయి. అయితే ఈసారి ఆయన తొలిసారిగా భక్తి ప్రధాన కథాంశంతో కూడిన చిత్రంలో నటిస్తుండటం, ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, తొలి పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో 'ఇరుముడి'పై అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ చిత్రంతో రవితేజ మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంటారో లేదో చూడాలి.



# ఎన్టీఆర్ - త్రివిక్రమ్ మూవీ.. పోస్టర్‌పై ట్రోల్స్

ఎన్నో రోజులుగా ఎదురుచూసిన జూనియర్ ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ సినిమాపై బిగ్ అప్డేట్ వచ్చేసింది. వీరి కాంబినేషన్ లో రాబోతున్న కొత్త సినిమాపై అధికారిక ప్రకటన వచ్చేసింది. పురాణాలతో ముడిపడిన కథతో ఈ సినిమా రాబోతోంది. ఈ సినిమాలో జూనియర్ ఎన్టీఆర్ కార్తికేయుడిగా మెరువనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. శివుడి కుమారుడు.. పార్వతీదేవికి గర్వకారణం... దేవ సేనాని.. మరోసారి త్రివిక్రమ్ తో అంటూ ఈ సందర్భంగా ఎన్టీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఓ పోస్టర్ కూడా వదిలారు.

## ఎన్టీఆర్ సినిమా పోస్టర్ పై ట్రోల్స్


ఎన్టీఆర్-త్రివిక్రమ్ సినిమా పోస్టర్ పైన సోషల్ మీడియాలో ట్రోల్స్ మొదలయ్యాయి. సినిమా అనౌన్స్మెంట్ లో భాగంగా విడుదల చేసిన పోస్టర్, ఏఐ ద్వారా చేశారంటూ చిత్ర బృందంపై ఎన్టీఆర్ ఫ్యాన్స్, నెటిజెన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ బడ్జెట్ తో రాబోతున్న ఈ సినిమాను ప్రకటించే ముందు ఎలాంటి ఎఫర్ట్స్ పెట్టలేదని మండిపడుతున్నారు. సింపుల్ గా ఏఐ ద్వారా రెడీ చేసిన పోస్టర్ ను మాత్రమే వదిలారంటూ ట్రోలింగ్ చేస్తున్నారు. గ్రాండ్ ప్రజెంటేషన్, క్వాలిటీ పోస్టర్ లేదా వీడియోతో లంచ్ చేసి ఉంటే బాగుండేదని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# మకుటంలో నా పాత్ర పవర్ ఫుల్‌గా ఉంటుంది

కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ స్వీయ డైరెక్షన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'మకుటం'. సూపర్ గుడ్ ఫిలిమ్ బ్యానర్‌పై దివంగత ఆర్ బీ చౌదరి నిర్మించిన ఈ మూవీలో అంజలి, దుషారా విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'నచ్చాకే వచ్చేరా' సాంగ్‌ను రిలీజ్ చెయ్యగా.. నెట్టింట సూపర్ రెస్పాన్స్ సొంతం చేసుకుంటుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అంజలి 'మకుటం' చిత్రంలో తన పాత్రపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. "మదగదరాజా' తరువాత విశాల్‌తో చేసిన సినిమా ఇది. అప్పుడు విశాల్ హీరో.. ఇప్పుడు దర్శకుడు కూడా. ఇందులో నేను ఓ మంచి, పవర్ ఫుల్ రోల్ చేశా. మా ఇద్దరికీ 15 ఏళ్ల అనుబంధం ఉంది. 'మకుటం'తో విశాల్‌కు దర్శకుడిగా పెద్ద విజయం దక్కాలి. జీవీ ప్రకాష్ మ్యూజిక్ ఎప్పుడూ బాగుంటుంది. ఇందులో 'నచ్చాకే వచ్చేరా' పాట నాకెంతో ఇష్టం'. ఈ చిత్రాన్ని నిర్మించిన ఆర్ బీ చౌదరి గారు మా మాధ్య ఉన్నట్లు అనిపిస్తుంది.. ఆయన్ని చాలా మిస్ అవుతున్నాము' అంటూ చెప్పుకొచ్చింది.



# అరుదైన రికార్డును సొంతం చేసుకున్న 'కుర్చీ మడత పెట్టి' సాంగ్




సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, శ్రీలీల, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గుంటూరు కారం'. ఈ సినిమాకు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించగా, ఎస్.ఎస్. తమన్ సంగీతం అందించారు. ఈ చిత్రంలోని 'కుర్చీ మడతపెట్టి' పాట ఎలాంటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పాట విడుదలైన తర్వాత దీనిపై పలు వివాదాలు చెలరేగినా, వాటన్నింటినీ అధిగమించి ఈ సాంగ్ సెన్సేషన్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఈ పాట మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. తెలుగులో అత్యంత వేగంగా 800 మిలియన్ వ్యూస్ సాధించిన పాటగా 'కుర్చీ మడతపెట్టి' కొత్త రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఈ పాట దూసుకెళ్తున్న వేగాన్ని చూస్తుంటే త్వరలోనే 1 బిలియన్ వ్యూస్ మైలురాయిని కూడా అందుకోవడం ఖాయమని మహేష్ అభిమానులతో పాటు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పాటలో మహేష్ బాబు, శ్రీలీల ఎనర్జిటిక్ డ్యాన్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఎస్.ఎస్. తమన్ అందించిన మాస్ బీట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీకృష్ణ, సాహితి చాగంటి ఆలపించిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. మొత్తంగా విడుదలైన చాలా కాలం తర్వాత కూడా 'కుర్చీ మడతపెట్టి' పాట అదే క్రేజ్‌తో ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది.

# శాకా హారులుగా మారిపోయాం!..


"ఇప్పటివరకు నా కెరీర్‌లో గ్లామరస్ రోల్స్ ఎక్కువగా చేశాను. కానీ మొదటిసారి 'నాగబంధం'లో 'పార్వతి' అనే ఒక వేద విద్యార్థిని పాత్రలో కనిపిస్తాను. తన కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా తెగించే అత్యంత పవర్‌ఫుల్ అండ్ ఎమోషనల్ క్యారెక్టర్ ఇది. కథను మలుపు తిప్పే ప్రతి మేజర్ డెసిషన్ నా పాత్ర ద్వారానే జరుగుతుంది. స్క్రీన్ పై నన్ను చూసి ఆడియన్స్ ఖచ్చితంగా షాక్ అవుతారు. నా లుక్ కోసం రోజుకు రెండు గంటల పాటు మేకప్ వేసుకునేదాన్ని" అని తెలిపింది. ఈ సినిమా కోసం ఆర్ట్ డైరెక్టర్ అద్భుతమైన అనంత పద్మనాభస్వామి ఆలయ సెట్ వేశారు. ఆ సెట్ లో జరిగిన షూటింగ్ అనుభవాలను నభా గుర్తుచేసుకుంది. "ఆ అనంత పద్మనాభస్వామి ఆలయ సెట్‌లోకి అడుగుపెడితే నిజమైన గుడిలోకి వెళ్లినట్లే ఉంటుంది. అందుకే దైవభక్తితో, ఎంతో నియమనిష్టలతో మేమంతా పనిచేశాం. షూటింగ్ జరిగినన్ని రోజులూ సెట్‌లో ఉన్నవారంతా పూర్తిగా శాకాహారులుగా మారిపోయాం. అంతేకాదు, అక్కడ ఒక అర్చకుడిని ప్రత్యేకంగా నియమించి.. ప్రతిరోజూ స్వామివారికి పూజలు నిర్వహించిన తర్వాతే షూటింగ్ స్టార్ట్ చేసేవాళ్లం." సినిమాలో వచ్చే డాన్స్ నంబర్స్ విజువల్ ఫీస్ట్‌లా ఉంటాయని నభా లీక్ ఇచ్చింది. "ఈ చిత్రంలో 'నమోరే' అనే పాటతో పాటు ఒక క్రేజీ జానపద గీతం కూడా చేశాను. ముఖ్యంగా దాదాపు 5,000 మంది డ్యాన్సర్లతో స్టార్ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య మాస్టర్ ఒక సాంగ్‌ను కంపోజ్ చేశారు. బృందావనంలో గోపికలంతా కలిసి వేడుక చేసుకుంటే ఎలా ఉంటుందో.. అంతటి పండుగ వాతావరణం ఆ సాంగ్ సెట్‌లో కనిపించింది. క్లాసికల్ టచ్‌తో భక్తిభావం ఉట్టిపడేలా ఈ పాటను బిగ్ స్క్రీన్ పై అద్భుతంగా ఆవిష్కరించారు" అని వెల్లడించింది.





# ఈ ఏడాది రిలీజ్ కష్టమేనా?

టాలీవుడ్‌లో కథకు ప్రాధాన్యం ఇచ్చే హీరోల గురించి మాట్లాడితే ముందుగా గుర్తొచ్చే పేరు అడివి శేష్. విభిన్నమైన కథలు, థ్రిల్లింగ్ స్క్రీన్‌ప్లే, హాలీవుడ్ స్థాయి మేకింగ్‌తో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఆయన సినిమాల కోసం ప్రేక్షకులు ప్రత్యేకంగా ఎదురుచూస్తుంటారు. ఈ ఏడాది 'డకాయిట్' చిత్రంతో మరోసారి ఆకట్టుకున్న శేష్, ఇప్పుడు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'గూఢచారి 2'తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధవ-ంవుతున్నారు. అయితే ఈ సినిమా గురించి తాజాగా వినిపిస్తున్న వార్తలు అభిమానుల్లో ఆందోళనను కలిగిస్తున్నాయి. 'గూఢచారి'తో తెలుగు ప్రేక్షకులకు స్టైలిష్ స్పై థ్రిల్లర్ అనుభూతిని అందించిన అడివి శేష్, ఆ చిత్రానికి కొనసాగింపుగా 'G2'ను మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. కథ పరంగా, యాక్షన్ పరంగా, విజువల్ ట్రీట్ పరంగా మొదటి భాగాన్ని మించి ఉండేలా ప్లాన్ చేసిన ఈ సినిమా నిర్మాణం మాత్రం అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగుతోంది. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన దాదాపు 50 శాతం షూటింగ్ ఇంకా పూర్తికావాల్సి ఉంది. 2026 ముగియడానికి మరో ఆరు నెలల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో ఈ షూటింగ్‌ను పూర్తి చేసి, విడుదలకు సిద్ధం చేయడం చిత్రబృందానికి పెద్ద సవాల్‌గా మారినట్లు తెలుస్తోంది. ఈ ఆలస్యానికి ప్రధాన కారణం సినిమాలోని భారీ తారాగణమేనని ఫిలిం నగర్ వర్గాలు చెబుతున్నాయి. దేశంలోని వివిధ భాషలకు చెందిన ప్రముఖ నటీనటులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తుండటంతో వారి కాల్‌షీట్లను ఒకే షెడ్యూల్‌లో తీసుకొచ్చేందుకు చాలా కష్టంగా మారుతున్నట్లు తెలుస్తోంది. ఒక నటుడి డేట్స్ అందుబాటులో ఉంటే మరో నటుడి షెడ్యూల్ ఖాళీగా లేకపోవడం, మళ్లీ అందరినీ ఒకే సమయంలో సెట్‌పైకి తీసుకురావడానికి సమయం పట్టడం వల్ల షూటింగ్ పలుమార్లు వాయిదా పడుతున్నట్లు సమాచారం. పాన్ ఇండియా ప్రాజెక్టులకు ఇలాంటి సమస్యలు కొత్తవి కాకపోయినా, అనుకున్న సమయానికి రిలీజ్ చేయాలంటే ఇప్పుడు వేగం పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది.




# తేడా కొడితే కష్టమే?

టాలీవుడ్ యంగ్ హీరో విరాట్ కర్ణ హీరోగా నటించిన తాజా చిత్రం 'నాగబంధం'. ఈ సినిమాను జూలై 3న విడుదల చేయనున్నారు. అయితే ఈ చిత్రానికి సంబంధించిన పెయిడ్ ప్రీమియర్లను కూడా అదే రోజు ప్రదర్శించే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఇటీవలి కాలంలో అనేక చిత్రాలకు పెయిడ్ ప్రీమియర్లు వేస్తున్న విషయం తెలిసిందే. ప్రీమియర్ల ద్వారా సినిమాకు మంచి టాక్ వస్తే తొలి రోజు ఓపెనింగ్స్ భారీగా నమోదవుతున్నాయి. అదే నెగెటివ్ టాక్ వస్తే మొదటి రోజు కలెక్షన్లపై ప్రభావం పడుతోంది. ప్రస్తుతం 'నాగబంధం'పై మంచి అంచనాలు ఉన్నాయి. ప్రీమియర్లు లేకుండా నేరుగా విడుదల చేస్తే తొలి రోజు మంచి ఓపెనింగ్స్ వచ్చే అవకాశముందని, కానీ ప్రీమియర్లకు నెగెటివ్ టాక్ వస్తే ఓపెనింగ్స్‌పై ప్రభావం పడే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఈ విషయంలో చిత్ర బృందం ఎలాంటి వ్యూహాన్ని అనుసరిస్తుందో చూడాలి. ఈ చిత్రంలో నాభా నటేష్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్లుగా నటించగా, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, అనసూయ భరద్వాజ్ కీలక పాత్రలు పోషించారు. అభిషేక్ నామా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మించారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**